వైఎస్ఆర్-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

శనివారం 05 జూలై 2025


## కూటమి ప్రభుత్వంలో గ్రామాలలోనే రోడ్లకు మహర్దశ..

### బీటీ రోడ్డు పునరుద్ధరణకు భూమి పూజ

చిన్నమండెం జూలై 04 ప్రభాత వార్త :



మండలంలోని కేశాపురం గ్రామం, రెడ్డివారిపల్లె కు రాయచోటిమదనపల్లి జాతీయ రహదారి నుండి రెడ్డివారిపల్లె వరకు రు 60.00 లక్షలతో బీటీ రోడ్డు పునరుద్ధరణకు రాష్ట్ర రవాణా యువజన క్రీడా శాఖ మంత్రివర్యులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆయన సతీమణి మండిపల్లి హరితమ్మ భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి సోదరుడు మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి మరియు గ్రామ టిడిపి నాయకులు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ద్యార్థినులను పరామర్శించిన డిఎమ్‌హెచ్‌ఓ

రాయచోటి జూలై 04 ప్రభాతవార్త

జిల్లా కలెక్టర్ వారి ఆదేశాల మేరకు చిన్నమండెం మండలం బోనుమల ప్రాథమిక పాఠశాలలో నలుగురు బాలికల పై దాడి ఘటనకు సంబంధించి విచారణ నిమిత్తం అన్నమయ్య జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.లక్ష్మీ నరసయ్య హుటా హుటిన సంఘటన స్థలం కు వెళ్ళి బాలికలను , తల్లితండ్రులు ను పరామర్శించడం జరిగింది. ఈ సందర్భంగా డా.లక్ష్మీ నరసయ్య మాట్లాడుతూనిన్న (3/7/25)బాలికల పై దాడి ఘటనలో బాలికలకు ఎటువంటి ఆరోగ్య పరమైన సమస్యలు లేవని , ఘటన జరిగిన వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం చిన్నమండెం వైద్యులు , ఆరోగ్య మరియు ఆశా కార్యకర్తలు వెంటనే వెళ్లి తగు చికిత్స చేయమని ఆదేశాలు ఇవ్వడం జరిగింది అని , వైద్య సిబ్బంది వెంటనే తగు చర్యలు చేపట్టి మెరుగైన వైద్యం అందేలాగున కృషి చేయడం జరిగింది అని , 24 గంటలు వైద్యులు అందుబాటులో ఉండి వైద్యుల పర్యవేక్షణలో బాలకలను పర్యవేక్షించాలని ఆదేశాలు ఇవ్వడం జరిగింది అని తెలిపారు ... ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ లు , సూపర్ వైజర్ లు, ఏ.ఎన్. ఎమ్ లు ,ఆశా కార్యకర్తలు , అబ్దుల్ హకీమ్ తదితరులు పాల్గొన్నారు.

# చెన్నంపల్లె పాఠశాలకు రాజకీయ గ్రహణం





బద్వేలు, జూలై 4, ప్రభాతవార్త :

ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా, ప్రభుత్వ పాఠశాలలు నడుపుతున్నామని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపాలని చెబుతున్న ప్రభుత్వానికి ఈ పాఠశాల చూస్తే కూలి పనిచేసుకుని అయినా పిల్లలను ప్రైవేటు పాఠశాలలో చేర్చాలనే పరిస్థితి నెలకొంది. మున్సిపాలిటీలోని చెన్నంపల్లె ప్రాథమిక పాఠశాలలో 65 మంది విద్యార్థులు, 5 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. జాతీయ రహదారి పుణ్యమా అని రోడ్డుకు అడ్డంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలను తొలగించారు. దీంతో విద్యార్థులు ఎక్కడికి వెళ్లాలో తెలియక ఇబ్బందులు పడుతున్న తరుణంలో ఉపాధ్యాయులంతా కలిసి చెన్నంపల్లె గ్రామంలో చిన్న అద్దె ఇల్లును తీసుకుని ప్రస్తుతం పిల్లలకు విద్యాబోధన అందిస్తున్నారు. పాఠశాల తొలగింపునకు గానుజాతీయ రహదారికి సంబంధించిన అధికారులు 25 లక్షలు రూపాయలను ఎంపీడీవో అకౌంటుకు జమ చేశారు. ఈ నిధుల ద్వారా పాఠశాల నిర్మించుకోవాలని ఉపాధ్యాయులు భావించినప్పటికీ ఇక్కడ రాజకీయం చోటు చేసుకోవడంతో సంవత్సర కాలం విద్యార్థులు రోడ్లపైన విద్యాబోధన చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. పాఠశాల వెనుక భాగంలోనే ప్రభుత్వ స్థలం కొద్దిగా ఉన్నప్పటికీ ఆ ప్రాంతంలో పాఠశాల నిర్మించుకోవాలని ఉపాధ్యాయులు తహశీల్దారుకు విన్నవించుకోగా వాటిలో ఉన్న కొన్ని సమస్యలు ఉండడం వలన వలన ఆ స్థలం పాఠశాలకు కేటాయించలేమని చెప్పినట్లు తెలిసింది. ఈ విషయాన్ని తెలుగుదేశం నేత రితేష్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో చెన్నంపల్లె గ్రామంలోనే బయట భాగంలో అర్థ ఎకరా స్థలాన్ని స్కూల్‌కు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పాఠశాల నిర్మాణం చేపట్టాలని ఉపాధ్యాయులు అడుగుతున్నప్పటికీ ఎంపీడీవో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. ఇక్కడ ఎంపీడీవో, ఎంపీపీ ఇరువురు పాఠశాల నిర్మాణంపై దృష్టిపెట్టడం లేదని దీని వలన విద్యార్థులు ఒక అద్దె ఇంట్లో ఇరుకైన గదులలో ఊపిరాడక విద్యాబోధనలు చెప్పించుకోవాల్సిన దుస్థితి ఏర్పడుతుందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాజకీయంగా పాఠశాలకు గ్రహణం పట్టడంతో ఇటు వైసీపీ, అటు తెలుగుదేశం మధ్యలో విద్యార్థులు బలి అవుతున్నారు. ఎంపీడీవో అకౌంట్‌లో ఉన్న 25 లక్షలను సర్వశిక్ష అభియాన్‌కు పంపితే వారు మిగిలిన డబ్బులు జమచేసి పాఠశాల నిర్మాణానికి దోహదపడతారని చెన్నంపల్లె పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు చెబుతున్నా వారు పట్టించుకోకపోవడంతో నిధులు మురిగి పోతున్నాయి. ప్రభుత్వ పాఠశాలకు పిల్లలను పంపాలని ఉపాధ్యాయులు గ్రామంలోకి వెళ్లి అడిగితే మీకు పాఠశాల భవనమే లేదు. ఉన్న అద్దె భవనం ఎప్పుడు కూలుతుందో తెలియడం లేదని మేము ఎలా పిల్లలను పాఠశాలకు పంపాలని అడుగుతున్నట్లు ఉపాధ్యాయులు తెలుపుతున్నారు. సంవత్సర కాలంగా పిల్లలు ఇబ్బందులు పడుతున్నా ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంతో విద్యార్థులు పడే బాధలు చూసి తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. ఉన్న పిల్లలు కూడా ఎక్కడ పాఠశాల మానేసి వెళ్లిపోతారోనని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడిపుడే ప్రభుత్వ పాఠశాలపై నమ్మకంతో తల్లిదండ్రులు పాఠశాలలో పిల్లలను చేర్పిస్తుంటే ఇలాంటి దురదృష్టకర పరిస్థితుల కారణంగా తల్లిదండ్రులు వెనకడుగు వేస్తున్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ మాత్రం ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన వసతులు కల్పించి విద్యాబోధన అందించి విద్యార్థులు ఉన్నత శిఖరాలకు వెళ్లేలా తీర్చిదిద్దాలనే సంకల్పంతో ఉంటే ఇక్కడ పరిస్థితి అధికారుల నిర్లక్ష్యం వలన రాజకీయం చోటు చేసుకుని పిల్లల పరిస్థితి అగమ్య గోచరంగా మారింది.

### మాకు త్వరగా పాఠశాల నిర్మించండి



గత సంవత్సర కాలంగా విద్యార్థులకు పాఠశాలలు లేక ఇబ్బందులు పడుతున్నామని ఉపాధ్యాయులంతా కలిసి అద్దె భవనంలో పాఠశాల జరుపుకుంటున్నామని పాఠశాల ప్రధానోపాధ్యాయులు షమీర్‌బాష అన్నారు. ఇటు అధికారులు, అటు నాయకులు గాని పట్టించుకోపోవడం వలనే ఈరోజు పిల్లలు ఎండకు, వానకు ఇబ్బంది పడే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టిపెట్టి త్వరగా పాఠశాల నిర్మిస్తే విద్యార్థుల విద్యాబోధనకు ఇబ్బంది లేకుండా ఉంటుందని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చస్తున్నారు.

**షమీర్‌బాష, పాఠశాల ప్రధానోపాధ్యాయులు**

## తెలుగుదేశం జెండా ఎగిరేలా కృషి చేయాలి

రాజంపేట, జూలై4 ప్రభాతవార్త



రాజంపేటలో తెలుగుదేశం జెండా ఎగిరేలా ప్రతి నాయకుడు, కార్యకర్త, కృషి చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు చమర్తి జగన్మోహన్రాజు పిలుపునిచ్చారు. సంస్థగతంగా పార్టీకి తిరుగులేదని, పార్టీలో కష్టపడి పనిచేసే వాళ్ళకే పదవులు లభిస్తాయని స్పష్టం చేశారు. శుక్రవారం రాజంపేట ఏబి చంద్రారెడ్డి కళ్యాణ మండపంలో జరిగిన నియోజకవర్గ స్థాయి సుపరిపాలన తొలి అడుగు శిక్షణా శిబిరంలో నియోజకవర్గ అబ్జర్వర్లు, భీమినేని చిట్టిబాబు, సంస్థాగత ఎన్నికల అబ్జర్వర్ కిరణ్ కుమార్, మండల అబ్జర్వర్లు వెంకటేశ్వర రాజు, రమణతో కలిసి ఆయన ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలో కష్టపడి పనిచేసేవాళ్లే పదవులు తీసుకోవాలని కోరారు. పార్టీ కోసం పని చేసే ఆసక్తి ఉన్నవారికి, టిడిపిలో కష్టపడుతున్న వారికి మాత్రమే పదవులు దక్కుతాయని, ఇందులో ఎలాంటి పైరవీలకు తావు లేదని తేల్చి చెప్పారు. గత ప్రభుత్వం కూల్చడంతో పాలన మొదలు పెడితే, మన ప్రభుత్వం నిర్మించడంతో మొదలు పెట్టిందన్నారు. కూల్చడానికి కష్టపడాల్సిన అవసరం లేదని కానీ నిర్మించడానికి చాలా కష్టపడాల్సిన అవసరం ఉందన్నారు. అందుకే ప్రభుత్వం ఏడాది పూర్తయిన సందర్భంగా సుపరిపాలన తొలి అడుగు పేరుతో కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి ప్రతి ఇంటికి వెళ్లి వారి అభిప్రాయాలను తెలుసుకొని మరింత మెరుగైన పాలన ఇచ్చేందుకు సిద్ధమైందన్నారు. అలాగే దేశంలోనే అత్యంత టెక్నాలజీ వినియోగించుకుని నడుస్తున్న పార్టీ తెలుగుదేశం పార్టీ అని, ఇక్కడ ఎవరు ఏం చేస్తున్నారో, ఏ కార్యకర్త ఎంత పని చేస్తున్నారో, పార్టీ కోసం ఎవరు కష్టపడుతున్నారు అనేది అధిష్టానానికి అన్ని లెక్కలు ఉన్నాయని తెలిపారు .ఎవరో పైరవీ చేస్తే ఎవరికీ పదవులు రావని, పదవుల కోసం ఎవరిని కాక పట్టాల్సిన అవసరం లేదని, కానీ పార్టీ కోసం పని చేయాల్సిన అవసరం అయితే మాత్రం ఎంతో ఉందని ఆయన తెలియజేశారు. తొలి అడుగు పేరుతో ఇంటింటికి వెళ్తున్న ప్రతి కార్యకర్త గత ప్రభుత్వానికి మన ప్రభుత్వానికి ఉన్న తేడాను స్పష్టంగా వివరించాలని కోరారు.భవిష్యత్తులో చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాలు పథకాల గురించి తెలియజేయాలని ఆయన సూచించారు. అలాగే తెలుగుదేశం పార్టీకి సంబంధించి ప్రతి నాయకుడు కార్యకర్త కుటుంబ సభ్యుడు తో సమానమని, అందరూ కలసికట్టుగా పనిచేసి రాజంపేటలో తెలుగుదేశం జెండా ఎగిరేలా పని చేయాలని పిలుపునిచ్చారు. రాజంపేట నియోజకవర్గంలో క్యాడర్ వున్నా గెలుపుకు దూరంగా ఉన్నామని, భవిష్యత్తులో టిడిపి జెండా ఎగరవేసి అధిష్టానానికి బహుమతిగా అందించాలని కోరారు. గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన అవకతవకలతో పాటు, వారి పాలనకు మన పాలన అందుతున్న పథకాలు, భవిష్యత్తులో అందించే పథకాలు అభివృద్ధిపై గ్రామ గ్రామాన ప్రతి ఒక్క కుటుంబానికి అర్థమయ్యే రీతిలో తెలియజేస్తూ వారి సమస్యలను కూడా పరిష్కరించేలా ముందుకు వెళ్లడమే సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అని ఆయన తెలియజేశారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అబ్జర్వర్ చిట్టిబాబు, సంస్థాగత ఎన్నికల అబ్జర్వర్ కిరణ్ కుమార్, మండల అబ్జర్వర్ వెంకటేశ్వరరాజు, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అధ్యాపల ప్రతాప్ రాజు టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్, రాష్ట్ర కార్యదర్శి ఇడిమడకల కుమార్. టిడిపి మండల అధ్యక్షులు గన్నే సుబ్బ నరసయ్య నాయుడు, డి ఆర్ ఎల్ మని, భానుగోపాల్ రాజు, కళ్ళే రెడ్డప్ప, క్లస్టర్ ఇన్చార్జిలు కొల్లి రెడ్డయ్య నాయుడు, పసుపులేటి ప్రవీణ్ కుమార్, పలువురు టిడిపి ముఖ్య నాయకులు కార్యకర్తలు యూనిట్ ఇన్చార్జిలు క్లస్టర్ ఇన్చార్జీలు బూత్ ఇన్చార్జిలు పాల్గొన్నారు.

## పోలీసుల అదుపులో నకిలీ పట్టాల తయారీ ముఠా

### : లోతుగా విచారణ చేస్తున్న పోలీసులు : పలు పార్టీల నేతలు ఉన్నట్లు సమాచారం

బద్వేలు, జూలై 4, ప్రభాతవార్త :



మళ్లి నకిలీ పట్టాల వ్యవహారం తెరపైకి వచ్చింది. 2022 మే నెలలో 7 మందిపై నకిలీ పట్టాల తయారీముఠాను అరెస్టు చేసిన పోలీసులు మళ్లి వారిలోని కొందరిని తెరపైకి తెచ్చారు. పట్టణంలోని మార్తోమా నగర్‌లోని 812 సర్వే నెంబరులో తన పేరున ఉన్న ఓ పట్టాను ఓ మహిళ ఒక వ్యక్తికి కుదవ పెట్టింది. తర్వాత అదే పట్టాను నకిలీ పత్రం తయారుచేసి మరో వ్యక్తికి విక్రయించింది. అంతటితో వదలకుండా మూడవ వ్యక్తికి కూడా నకిలీ పట్టాలు తయారుచేసి వి క్రయించడంతో అసలు వ్యవహారం బయటపడింది. మోసపోయిన వ్యక్తి పోలీసుస్టేషన్‌కు వెళ్లి ఓ మహిళ తనను మోసం చేసిందని తెలపగా వెంటనే పోలీసులు రెవెన్యూ కార్యాలయానికి ఆ పట్టాను పంపారు. గోపవరం రెవెన్యూ అదికారులు పరిశీలించి ఈ పట్టా నకిలీ పట్టా అని తేల్చారు. ఆమెపై కేసు నమోదు చేసి పోలీసులు విచారణ చేపట్టగా దొంగపట్టా తయారు చేసే నకిలీ ముఠాను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద కొన్ని పత్రాలు , కొన్ని సీల్‌లు స్వాధీనం చేసుకుని విచారిస్తున్నారు. ఈ విచారణలో నకిలీ పట్టాల తయారీ ముఠా పలు పార్టీల నేతలకు నకిలీ పట్టాలను తయారుచేసి ఇచ్చినట్లు సమాచారం. అయితే పోలీసులు మాత్రం ఎలాంటి సమాచారం బయటకు ఇవ్వడం లేదు. లోతుగా విచారణ చేస్తున్నాం. కొద్దిరోజులు సమయం పడుతుందని చెబుతున్నప్పటికీ పోలీసుల ఆధీనంలో ఉన్న ముఠామాత్రం నకిలీ పట్టాల తయారీ సూత్రధారులని పూర్తి సమాచారం. వీరిలో ఒక రెవెన్యూ ఉద్యోగి ద్వారా ఈ పట్టాలు తయారుచేసినట్లు పోలీసులు నిర్ధారించినట్లు సమాచారం. గతంలో ఆర్డీవో ఆకుల వెంకటరమణ ఈ నకిలీ పట్టాల వ్యవహారంపై ప్రత్యేక దృష్టిపెట్టి వంద మందిని నకిలీ పట్టాల సూత్రధారులుగా గుర్తించినప్పటికీ కొన్ని రాజకీయ కారణాల వలన కేవలం 7 మంది పై మాత్రమే కేసు నమోదు చేశారు. ఆ కేసు ఇప్పటికీ నడుస్తున్నప్పటికీ అదే కోణంలో అదే ముఠా ఈ వ్యవహారానికి పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నట్లు సమాచారం ప్రస్తుతం వీరందరూ పోలీసు విచారణలో ఉన్నారు. అయితే కొంతమంది రాజకీయ నాయకుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. ఆ ముఠా పట్టాలు తయారు చేసి కొంతమంది పార్టీ నేతలకు నకిలీ పట్టాలు తయారు చేసి ఇచ్చినట్లు సమాచారం. వీరిలో అసలైన వ్యక్తులు ఎవరు , ఎంతమంది ఉన్నారు. ఎవరు లబ్ది పొందారు అనే విషయాలు పూర్తిగా తెలియాలంటే పోలీసులు బయటకు చెబితే తప్ప లేకపోతే పూర్తి సమాచారం తెలియవలసి ఉంది.

## స్కూటీ ట్రాక్టర్ డీ కొని ఒక్కరికి తీవ్ర గాయాలు

లక్కిరెడ్డిపల్లి; జూన్ 04, ప్రభాత వార్త

లక్కిరెడ్డిపల్లి మండలం దొరిచెరువు వద్ద స్కూటర్ ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి తీవ్ర గాయాలైనట్లు వారి బంధువు తెలిపారు బంధువుల వివరాల మేరకు అబు సిద్ధిక్ అనే వ్యక్తి వేంపల్లి నుండి లక్కిరెడ్డిపల్లి కు స్కూటీలో వస్తుండగా లక్కిరెడ్డిపల్లి నుండి కోరంపేట వైపు వెళుతున్న ట్రాక్టర్ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి ఇతన్ని స్థానికులు 108 ద్వారా లక్కిరెడ్డిపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు మెరుగైన వైద్యం కొరకు కడప రిమ్స్ కు తరలించినట్లు ఆస్పత్రి సిబ్బంది తెలిపారు.

## వైభవంగా కనకదుర్గమ్మ అమ్మవారికి విశేష పూజలు






బద్వేల్ అర్బన్ జూలై 04 ప్రభాతవార్త :

బద్వేల్ పట్టణంలోని పోలీస్ స్టేషన్ ఆవరణంలో వెలసిన శ్రీ శ్రీ శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారిని శుక్రవారం ఆలయ పూజారి ప్రదీప్ కుమార్ శర్మ ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుండి వివిధ రకాల ప్రత్యేక పూజలను అంగరంగ వైభవంగా నిర్వహించడం జరిగింది, అనంతరం వివిధ రకాల ప్రత్యేక కోనులతో కనకదుర్గమ్మ అమ్మవారికి చేపట్టిన అలంకారం పలువురు భక్తులను ఆకట్టుకునే విధంగా నిలిచింది, పలువురు భక్తిశ్రద్ధలతో కనకదుర్గమ్మ అమ్మవారిని దర్శించుకుని తమ భక్తిని చాటుకున్నారు, అలాగే ఆర్డీఓ చంద్రమోహన్ అమ్మవారిని దర్శించుకున్నారు, వారికి ఆలయ కమిటీ సభ్యులు పద్మావతి మెడికల్ స్టోర్ దర్శి సుబ్బరాజా, వడ్లపూడి నాగభూషణం, మాజీ మార్కెట్ డైరెక్టర్ పబ్బతి చంద్రశేఖర్, అశోక్ కుమార్ రెడ్డి, బీరం రవిశంకర్ రెడ్డి, తో పాటు పలువురు కమిటీ సభ్యులు ఆర్డీఓ చంద్రమోహన్ కు అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి శాలువా, పూలమాలతో సత్కరించి స్వామివారి ప్రసాదాలను అందజేశారు, ఈ సందర్భంగా ఆర్డీవో చంద్రమోహన్ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ ఆవరణంలో వెలసిన శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరికీ ఉండాలని వారు ఆకాంక్షించారు, శుక్రవారం సాయంత్రం శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారిని బద్వేల్ ఎమ్మార్వో ఉదయభాస్కరరాజు అర్బన్ ఎస్ఐ మాడిశెట్టి సత్యనారాయణ, రూరల్ ఎస్సై శ్రీకాంత్ తోపాటు పలువురు అధికారులు దర్శనం చేసుకున్నారు, వారికి ఆలయ కమిటీ సభ్యులు కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ప్రసాదాలను అందజేశారు,ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ పరిటాల వెంకటసుబ్బయ్య, పైడిమర్రి సుబ్రహ్మణ్యం తో పాటు పలువురు పాల్గొన్నారు

## డ్రాగన్ ఫ్రూట్స్ కు జీవామృతం..

సుండుపల్లి, జులై 04, ప్రభాతవార్త :

మండల పరిధిలోని ప్రకృతి వ్యవసాయం ద్వారా డ్రాగన్ ఫ్రూట్స్ కు జీవామృతం తయారుచేసి వాడినట్లు ప్రకృతి వ్యవసాయ అధికారులు శుక్రవారం తెలిపారు. సుండుపల్లి మండలంలోని జి.రెడ్డి వారి పల్లి కు చెందిన ఆదర్శ రైతుగా పని చేసిన బాబు రెడ్డి ఒక ఎకరా పొలం డ్రాగన్ ఫ్రూట్ కు తోటకు 200 లీటర్ల ద్రవ జీవామృతం డ్రాగన్ ఫుడ్స్ తోటకు అందించారు. రైతు మాట్లాడుతూ.. దాదాపుగా 20 సంవత్సరాలు ఆదాయం వస్తుందని, అలాగనే మంచి లాభాలు వస్తాయని అన్నారు.

## తెలుగుదేశంతోనే అభివృద్ధి సాధ్యం

బద్వేలు, జూలై 4 (ప్రభాతవార్త):



సంవత్సర కాలంలో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిలో దూసుకుపోతుందని ఎన్నో సంవత్సరాలుగా వెనుకబడి ఉన్న పరిస్థితి నుంచి చంద్రబాబునాయుడు గట్టెక్కించారని టీడీపీ సమన్వయకర్త రితేష్‌రెడ్డి అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం మూడవ రోజు బద్వేలు మున్సిపాలిటీలోని 10వ వార్డు సుమిత్రా నగర్, సిద్దార్థ స్కూల్ పరిసర ప్రాంతాలలో నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో అనేక సంక్షేమ పథకాలు ప్రజలకు అందించిందని వారు అన్నారు. ఈ పథకాలకు సంబంధించిన కరపత్రాలను ప్రతి ఇంటికి చేరవేయడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమన్నారు. ప్రభుత్వం ప్రజా సంక్షేమం పట్ల ప్రత్యేక దృష్టి పెట్టి హామీ ఇచ్చిన వాటికంటే అనేక పథకాలను ప్రజల ముందుకు తీసుకెళ్లేందుకు అహర్నిషలు కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తుందని రితేష్‌రెడ్డి తెలిపారు. ఇప్పటికే కూటమి సంవత్సర కాలంలో అభివృద్ధిలో వెనకడుగు వేయకుండా ఎన్ని సమస్యలు వచ్చినా పట్టించుకోకుండా కేవలం అబివృద్దే ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు వెంగళరెడ్డి, రోశన్న, రాగిమాను ప్రతాప్‌కుమార్, తుడిమెళ్ల వెంకటసుబ్బయ్య, లకిడి విజయ్, శివయ్య, తుడిమెళ్ల సురేష్, నాగభూషణం, ఉప్పలపాటి వెంకటసుబ్బయ్య, నరసింహనాయుడు, సింగంశెట్టి వెంకటసుబ్బయ్య, ఏవో సుధాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ గోవిందరెడ్డికి బిగ్ షాక్

### 30 కుటుంబాలు టీడీపీ లోకి చేరిక

పోరుమామిళ్ల రూరల్, జూలై4 ప్రభాతవార్త:

పేద బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కూటమి ప్రభుత్వ లక్ష్యమని బద్వేల్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, సమన్వయకర్త రితీష్ రెడ్డి అన్నారు. కాసినయన మండలం లోని సావిశెట్టిపల్లె గ్రామం లో సూపరిపాలనలో తొలి అడుగు అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె స్థానిక నాయకులు ఘనా స్వాగతం పలికారు. ప్రతి ఇంటికి తిరిగి ప్రభుత్వం అందిస్తున్న పథకాలు అందుతున్నాయ లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి అందించాలనేదే సీఎం చంద్రబాబు లక్ష్యమన్నారు. ఏ ప్రభుత్వం చేయని విధంగా పేద బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. అనంతరం ఎమ్మెల్సీ డిసి గోవింద్ రెడ్డి వర్గీయులు వైసీపీ నుండి టిడిపిలోకి 30 కుటుంబాలను కండువా కప్పి ఆహ్వానించారు. దీంతో ఎమ్మెల్సీ డిసి గోవిందరెడ్డికి బిగ్ షాక్ తగిలిందని చెప్పుకోవచ్చు.. కూటమి ప్రభుత్వం చేస్తున్న మంచే వైసీపీ నుండి టిడిపిలోకి చేరారని వారన్నారు. వారు మాట్లాడుతూ.. ప్రతి గ్రామం సస్యశ్యామలంగా ఉండాలంటే ప్రతి నాయకుడు కార్యకర్త ప్రజా సమస్యలపై దృష్టి సారించాలన్నారు.. ప్రజలకు ఎటువంటి సమస్య వచ్చిన సత్వరమే పరిష్కరించే విధంగా కృషి చేయాలని సూచించారు. గత ప్రభుత్వంలో గ్రామాలు ఎటువంటి అభివృద్ధి చెందలేదు అన్నారు. ప్రతి కార్యకర్త స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రతి గ్రామంలో టీడీపీ జెండాలు ఎగరవెయ్యాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## అనధికార భవనానికి నోటీసులు జారీ చేసిన అధికారులు

బద్వేలు, జూలై 4 (ప్రభాతవార్త):

మున్సిపాలిటీ పరిధిలో చెన్నంపల్లె రెవెన్యూ గ్రామంలోని సర్వే నెం.1768లో ఫణీంద్రరెడ్డి, లక్ష్మిదేవి అనే వ్యక్తులు 4 సెంట్ల విస్తీర్ణంలో అనధికారికంగా భవనాన్ని నిర్మించడం జరిగినట్లు మున్సిపల్‌కమిషనర్ నరసింహారెడ్డి తెలిపారు. సదరు భవన నిర్మాణ యజమానులకు పురపాలక సంఘం వారు పలునోటీసులు ఇచ్చినప్పటికీ వారు పట్టించుకోకపోవడంతో 1965 చట్టం ప్రకారం వాటిని సీజ్ చేసినట్లు తెలిపారు.ఎవరైనా అక్రమ భవన నిర్మాణాు చేపడితే వాటిని తొలగించడమే కాకుండా నిరా ్మణాలు చేపట్టిన వారిపైకఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

## గంజాయి అక్రమ రవాణా పై రైళ్లలో విస్తృత తనిఖీలు

రాజంపేట, జూలై4 ప్రభాతవార్త

గంజాయి అక్రమ రవాణా పై ఈగల్, లోకల్ పోలీసులు, జి.ఆర్.పి, ఆర్.పి.ఎఫ్ పోలీసులు శుక్రవారం ఎక్స్‌ప్రెస్ రైళ్లలో సంయుక్తంగా తనిఖీలు నిర్వహించినట్లు ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు పేర్కొన్నారు. గంజాయి నియంత్రణే లక్ష్యంగా ముంబై సూపర్ ఫాస్ట్ ఎక్స్ ప్రెస్ ట్రైన్ లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. గంజాయి, మాదక ద్రవ్యాల గురించిన సమాచారాన్ని టోల్ ఫ్రీ నంబరు 1972కు అందించాలని జిల్లా ఎస్పీ తెలిపారు. రైళ్ళలో గంజాయి అక్రమ రవాణ నియంత్రణే లక్ష్యంగా ముంబై సూపర్ ఫాస్ట్ ఎక్స్ ప్రెస్ ట్రైన్ లో లోకల్ పోలీసు, జి.ఆర్.పి., ఈగల్ మరియు ఆర్.పి.ఎఫ్ పోలీసులతో సంయుక్తంగా బృందాలను ఏర్పాటు చేసి, ఆకస్మిక తనిఖీలు చేపట్టినట్లుగా తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శ్రీ.వి.విద్యాసాగర్ నాయుడు మాట్లాడుతూ ఈగల్ ఐజి ఆకే రవికృష్ణ ఆదేశాలతో గంజాయి అక్రమ రవాణా ను నియంత్రించేందుకు ఈగల్, లోకల్ పోలీసు, గవర్నమెంట్ రైల్వే పోలీసు మరియు రైల్వే ప్రొటక్షన్ పోలీసులతో ప్రత్యేకంగా బృందాలను ఏర్పాటు చేసి, ముంబై సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ట్రైన్ లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించామన్నారు. గంజాయి ప్రధానంగా ఒడిస్సా రాష్ట్రం నుండి ఇతర ప్రాంతాలకు ట్రెయిన్స్ ద్వారా అక్రమంగా రవాణ అవుతుందన్న సమాచారంతో ప్రత్యేకంగా ట్రెయిన్స్ ను లక్ష్యంగా చేసుకొని తనిఖీలు చేపట్టామన్నారు.

## శాకాంబరి అలంకారంలో...

బద్వేల్ అర్బన్ జూలై 04 ప్రభాతవార్త :



బద్వేల్ పట్టణంలోని అమ్మవారి శాల వీధిలో వెలసిన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారికి ఆషాడమాసం పురస్కరించుకొని శుక్రవారం ఆర్యవైశ్య వర్తక సంఘం అధ్యక్షులు కే వి సుబ్బారావు సెక్రటరీ కొలిశెట్టి నాగరాజా మరియు పలువురు కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో తెల్లవారుజామునే ఆలయ పూజారి సుబ్రహ్మణ్యం స్వామి ఆధ్వర్యంలో వివిధ రకాల ప్రత్యేక ద్రవ్యాలతో వైభవంగా అభిషేకం కుంకుమార్చన కార్యక్రమాన్ని కనుల పండగగా నిర్వహించారు, అనంతరం వాసవి మాతాకు ప్రీతికరమైన వివిధ రకాల ప్రత్యేక కూరగాయలు పండ్లతో శాకాంబరి అలంకారం పలువురు భక్తులను ఆకట్టుకునే విధంగా నిర్వహించారు, అనంతరం రాత్రి మంత్రాలయం కు చెందిన ఎల్.వి వెంకట శర్మచే శ్రీ వారాహి అమ్మవారు మరియు శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ప్రవచనాలు నిర్వహించారు, ఆషాడ మాసం సందర్భంగా బద్వేల్ పట్టణ పరిసర ప్రాంతంలోని ఆర్యవైశ్యులందరూ తెల్లవారుజామునుండే వాసవి మాత అమ్మవారిని దర్శించుకొని అమ్మవారికి కాయ కర్పూరం సమర్పించుకొని తమ భక్తిని చాటుకున్నారు, వాసవి మాతాను దర్శించుకున్న పలువురు భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక తీర్థప్రసాదాలను అందజేశారు, ఈ కార్యక్రమంలో మహిళా మండలి అధ్యక్షురాలు దేవతి లలిత,శిరీష, వనిత క్లబ్ అధ్యక్షురాలు చింతకుంట ధనలక్ష్మి స్టేట్ మహిళా మండలి ఉపాధ్యక్షురాలు కొండపల్లి దేవి, వందవాసి ధనమ్మ, శారద చాటకొండు లక్ష్మి, ముచ్చర్ల సుజాత, బెస్త వేముల నాగ శిరీష, ముచ్చర్ల నిలిమ, పబ్బతి శ్రీదేవి, కొండపల్లి లక్ష్మీకాంతమ్మ, సుగుణ, ఉరిమి పద్మ,గంగిశెట్టి ధనలక్ష్మి, పత్తి భార్గవి, తులసి వరలక్ష్మి, నిచ్చిన మెట్ల రాధ , మదళ్ళపల్లి శిరీష, జూటూరు పద్మ, బొగ్గరపు వెంకటసుబ్బమ్మ, తోపాటు వాసవి, వనిత క్లబ్ మరియు ఆర్యవైశ్య వర్తక సంఘం యువజన సంఘం తోపాటు పలువురు కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

# నిరసన దీక్షలో బౌద్ధుల ఆగ్రహం



అరగుండు, అరమీసంతో నిరసన చేస్తున్న దృశ్యం

**మదనపల్లె, జులై 4 ప్రభాతవార్త :**
తథాగతుడు గౌతమ బుద్ధిని విగ్రహం తల నరకడాన్ని నిరసిస్తూ భారతీయ అంబేడ్కర్ సేవ చేపట్టిన నిరసన దీక్ష శుక్రవారం రెండో రోజుకు చేరింది. కేసును తప్పుతోవ పట్టించి, నిందితుల్ని కాపాడేందుకు తాలూకా పోలీసులు చేస్తున్న కుట్రలకు నిరసనగా పదిమంది బౌద్ధులు అరగుండు, అరమీసంతో వినూత్న నిరసన తెలియజేశారు. దళిత సేన కర్నాటక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీడా శ్రీనివాస్ ఆధ్వర్యంలో పెద్దసంఖ్యలో దళిత సేన సభ్యులు దీక్షలో పాల్గొని సంఘీభావం ప్రకటించారు. బుద్ధుని తల నరికిన మతోన్మాదులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని లేనిపక్షంలో కర్నాటక రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని బీడా శ్రీనివాస్ హెచ్చరించారు. పిటిఎం శివప్రసాద్ మాట్లాడుతూ మదనపల్లె రూరల్ మండలం, అంకిశెట్టిపల్లె సమీపంలోని గత 21సంవత్సరాలుగా తాము బుద్ధవిహార నిర్వహిస్తున్నామని ఇది సముద్ర మట్టానికి సుమారు 3వేల అడుగుల ఎత్తులో, ఎత్తైయిన కొండపై శిఖరం అగ్రభాగాన ఉన్నదని తెలిపారు. ఈ బుద్ధవిహారను మానవ వికాస కేంద్రంగా, అధ్యాత్మిక చైతన్య ప్రదేశంగా పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో ఇప్పటి వరకు రెండు కోట్లు రుపాయలకు పైగా ఖర్చు చేసి అభివృద్ధి పనులు చేశామని తెలిపారు. తాము ఎన్నో వ్యయ ప్రయాసాలకుకోర్చి అక్కడ నిర్మాణాలు చేస్తూ వస్తూంటే కొంతమంది ఉన్మాదులు పనిగట్టుకొని ఒక్కొక్కటి ధ్వంసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో గౌతమబుద్ధిని మూడు విగ్రహాలను, సిసి కెమరాలను, వాటర్ పైప్‌లైన్‌ను శిలాఫలకాలను ధ్వంసం చేశారని, దీనిపై మదనపల్లె రూరల్ పోలీస్‌స్టేషన్ నందురెండు కేసులు నమోదైనా, ఈ కేసులుట్ల పోలీసులు సరిగ్గా స్పందించలేదని, దీంతో ఉన్మాదులు మరింత బరితెగించి ఇప్పుడు నాలుగుసారి బుద్ధిని మరో విగ్రహాన్ని నిలువెత్తు పీఠంపై నుండి కిందకుతోసేసి, ధ్వంసం చేసి, తంగళాన్ సినిమాలననో లాగా తల నరికి తల మొండెం వేరుచేసి తను చేతిలో ఉంచి అమానుషంగా ప్రవర్తించారని చెప్పారు. ఈ విషయంలో సంబంధిత తాలూకా సర్కిల్ ఇన్స్‌పెక్టర్ నిందితులకు సహకరిస్తూ, కేసును నీరుగార్చేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని చెప్పారు. బుద్ధ విహార నిర్వాహకులైన మా వద్ద ఫిర్యాదు తీసుకోకుండా, మమ్మల్ని విచారించకుండా స్థానిక విఆర్‌ఓ వద్ద ఫిర్యాదు రాయించుకొని నామమాత్రపు కేసు నమోదె చేశారన్నారు. మేము అనుమానితుల పేర్లు వెల్లడించినా సిఐ పట్టించుకోలేదన్నారు. బుద్ధిని తల నరికిన ఉన్మాదులను కాపాడేందుకు సిఐ తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని, గతంలో నమోదు చేసిన కేసులను ఎలా నీరుగార్చారో అదే రీతిలో ప్రస్తుత కేసును కూడా నీరుగార్చేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారని తెలిపారు. దీనిపై ముఖ్యమంత్రికి ప్రత్యేక లేక పంపినట్లు తెలిపారు. నిందితులను గుర్తించి అరెస్టు చేసేవరకు ఆందోళన కొనసాగుతుందని శివప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బాస్ నాయకులు ముత్యాలమోహన్, చాట్ల బయన్న, గంపల రమణ, గంగాదర్, తలారి క్రిష్ణ, నాగరాజు, నీరుగట్టు రమణ, రాష్ట్ర గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు కోనేటి దివాకర్, ఎరికల సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆవుల మల్లికార్జున పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు భీమా పంపిణీ




**రామసముద్రం జులై 4 ప్రభాతవార్త**
రామసముద్రం గ్రామీణ బ్యాంకు లో ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి భీమా యోజన కింద లబ్ధిదారులకు 8లక్షల రూపాయలు మదనపల్లి ప్రాంతీయ మేనేజర్ శంకర ప్రసాద్ పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఏదైనా అనుకోని పరిస్థితులు ఎదురైనప్పుడు ప్రతి ఒక్కరూ తమ కుటుంబాలను రక్షించుకోవడానికి బీమా పాలసీలు కలిగి ఉండాలని ఆంధ్ర ప్రదేశ్ గ్రామీణ బ్యాంకు మదనపల్లె ప్రాంతీయ మేనేజర్ ఎం శంకర ప్రసాద్ అన్నారు. శుక్రవారం రామసముద్రం శాఖలో ఆయన ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి భీమా యోజన కింద 4 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి 200000 రూపాయల చెక్కును, చోళ బీమా పథకం కింద ఇతర లబ్ధిదారులకు 500000 రూపాయల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ ఎం రవి, ఫీల్డ్ ఆఫీసర్ గంగాధర్ మరియు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సారా రహిత గ్రామాలుగా ప్రకటన

**మదనపల్లె క్రైమ్, జులై 4 ప్రభాతవార్త.**
నిమ్మనపల్లి మండలంలోని బండ్లపై, పరేసువాండ్లపల్లి, నాగులయ్యగారిపల్లి, బల్లేవండ్లపల్లి గ్రామాలను సారా రహిత గ్రామాలుగా ప్రకటించినట్లు ఎక్సైజ్ సీఐ భీమలింగ తెలిపారు. శుక్రవారం ఆ గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది. గ్రామ స్థాయి కమిటీ, గ్రామ పెద్దలు, రెవెన్యూ, పోలీస్, సచివాలయ సిబ్బంది సమక్షంలో ఈ ప్రకటన చేశారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ సారా ను పూర్తిగా నిర్మూలించి, ప్రజల ఆరోగ్యాన్ని, భద్రతను కాపాడాలనే లక్ష్యంతో నవోదయం 2.0 ను ప్రభుత్వం ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. ఇది సత్ఫలితాలను ఇవ్వడంతో గతంలో సారావికాయాలు భారీగా జరిగిన పలు గ్రామాలు సారాలహిత గ్రామాలుగా మారుతున్నాయన్నారు. గ్రామాలు కృషి చేశాయి. గ్రామస్తుల సహకారం, వివిధ శాఖల సమన్వయంతోనే ఈ విజయం సాధ్యమైందని తెలిపారు. సారా రహిత గ్రామాలుగా మారడం ద్వారా ఆయా గ్రామాల్లో శాంతిభద్రతలు మెరుగుపడటంతో పాటు, ప్రజల జీవన ప్రమాణాలు కూడా పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఇతర గ్రామాలు కూడా ఇదే స్ఫూర్తితో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచులు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు, స్థానిక నాయకులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అల్లూరి సీతారామ రాజు జయంతి వేడుకలు



**సిద్ధవటం జులై 4 ప్రభాతవార్త**
11 వ పోలీస్ బెటాలియన్ నందు అల్లూరి సీతారామ రాజు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు, ఈ కార్యక్రమానికి కమాండెంట్ శ్రీ కె ఆనంద రెడ్డి ముఖ్య అతిదిగా విచ్చేసి అల్లూరి సీతారామ రాజు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు, ఈ సందర్భముగా కమాండెంట్ మాట్లాడుతూ భారత స్వాతంత్ర చరిత్రలో అల్లూరి సీతారామరాజు ఒక మహోజ్వల శక్తి. ఆయన జరిపిన సాయుధ పోరాటం స్వాతంత్ర్య ఉద్యమంలో ఒక ప్రత్యేక అధ్యాయం. సాయుధ పోరాటం ద్వారానే స్వతంత్రం వస్తుందని నమ్మి, దాని కొరకే తన పాణాలర్పించిన యోధుడు. కేవలం 27 ఏళ్ళ వయసులోనే బిటిషు సామాజ్యమనే మహా శక్తిని ఢీకొన్నాడు అని కొనియాడారు. ఈ కార్యక్రమము అసిస్టెంట్ కమాండెంట్‌లు పి.ఎన్.డి ప్రసాద్, బి.వెంకట శివుడు, కె. వెంకట రెడ్డి ఆర్.ఐ.లు ఆర్.యెస్.ఐ లు సిబ్బంది పాల్గొనడం జరిగింది.

## ఫారిన్ మెడికల్ గ్ర్యాడ్యుయేట్స్‌కు ఇంటర్నషిప్ ఇవ్వాలి

**రాష్ట్ర అధ్యక్షులు ఏవి.సుబ్బారెడ్డి**



**మదనపల్లె, జులై 4 ప్రభాతవార్త :**
ఫారిన్ మెడికల్ గ్ర్యాడ్యుయేట్స్‌కు ఏడాది పాటు ఇంటర్నషిప్‌తో పర్మనెంట్ రిజిస్టేషన్ ఇవ్వాలని రాష్ట్ర ఆసుపత్రుల అండ్ నర్సింగ్ హోమ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఏవి. సుబ్బారెడ్డి, కార్యదర్శి శ్రీనివాసులు కోరారు. వీరికి రాష్ట్రంలో ఏడాది పాటు మిగతా రాష్ట్రాల్లో లాగా కాంపిన్జేటరి సర్టిఫికెట్ ఉన్న ఫారిన్ మెడికల్ గ్ర్యాడ్యుయేట్స్ అనేది ఇవ్వాలన్నారు. దేశంలో ఉండే అన్ని రాష్ట్రాల్లో ఫారిన్ మెడికల్ గ్ర్యాడ్యుయేట్స్‌కు కాంపిన్జేటరీ సర్టిఫికెట్ ఉన్నట్లు అయితే ఒక్క ఏడాది మాత్రమే ఇంటర్నషిప్ ఇచ్చి పూర్తి అయిన వెంటనే ఆ రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ ద్వారా వారికి పర్మనెంట్ రిజిస్టేషన్ ఇస్తున్నారన్నారు. ఒక్క ఏపిలో మాత్రమే మెడికల్ కౌన్సిల్ ద్వారా పర్మనెంట్ రిజిస్టేషన్ పొందాలంటే వారికి రెండు, మూడు సంవత్సరాలు ఇంటర్నషిప్ చేయాలని ఆర్డర్స్ పాస్ చేస్తున్నారన్నారు. ఇటీవల మెడికల్ కౌన్సిల్ ఛైర్మెన్ కూడా వారి కోరిక న్యాయబద్ధమైందని వారి కోరిక ప్రకారం దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న పర్మనెంట్ రిజిస్టేషన్ వారి ప్రాసస్ మొదలు పెట్టామని తెలియజేసినప్పటికి అమల్లోకి రాకపోవడం భాదాకరమన్నారు. ఏపి మెడికల్ కౌన్సిల్ ప్రభుత్వం స్పందించి వెంటనే వారి న్యాయబద్ధమైన సమస్యలను పరిష్కరించాలన్నారు.

## సంక్షేమ పథకాల అభివృద్ధిపై ఇంటింటి ప్రచారం


కరపత్రాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

**పీలేరు జూలై 4 ప్రభాతవార్త:**
కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఏడాది పాలనలో అందించిన సంక్షేమ పథకాలు చేపట్టిన అభివృద్ధి పనులు ఇంటింటికి వెళ్లి కూటమి శ్రేణులు కరపత్రాలు పంచుతూ ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గ అధికార ప్రతినిధి కోటపల్లి బాబు రెడ్డి పీలేరు మండల అధ్యక్షులు వారణాసి శ్రీకాంత్ రెడ్డి వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ పురం రామ్మూర్తి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమం వ్యవసాయ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ పి రహమతుల్లా అధ్యక్షతన పీలేరు పట్టణంలోని మోడల్ కాలనీలో జరిగింది. ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది కాలం పూర్తి చేసుకున్న సందర్భంగా సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని మూడవరోజు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీలేరు మాజీ మండల అధ్యక్షులు ఎన్ అమర్నాథ్ రెడ్డి, మాజీ జెడ్పిటిసి మల్లెల రెడ్డి భాష, మాజీ సింగల్ విండో అధ్యక్షులు యల్లెల రెడ్డప్ప రెడ్డి.పీలేరు ఆర్టీసీడిపో ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షులు కొత్తపల్లి శ్రీనాథ్ రెడ్డి,టిడిపి సీనియర్ నాయకులు జయ చంద్రారెడ్డి, ప్రముఖ నాయకులు పోలిశెట్టి సురేంద్ర, షామియానా జయన్న యువ నాయకులు గుర్రం నరేష్, దేవి రెడ్డి వెంకటరమణారెడ్డి, పీలేరు నియోజకవర్గ బీసీ అధ్యక్షులు వసంతల రాజా, షౌకత్, రెడ్డి ముని, మిట్టమీద శివ, మునిరత్నం, శ్రీనివాసులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు. ప్రజాప్రతినిధులు, కూటమి శ్రేణులు, అనుబంధ సంఘాలు నల్లారి అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## మిట్స్ లో ఓరియంటేషన్ ప్రోగ్రాం



**కురబలకోట జులై 4 ప్రభాతవార్త**
మదనపల్లె ఇన్స్టిట్యూట్ అఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్, మదనపల్లె నందు గల ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం వారు మరియు మిట్స్ ఐఈఈఈ స్టూడెంట్ చాప్టర్ తో కలిసి బ్లాక్‌బెర్రీ లిమిటెడ్ అభివృద్ధి చేసిన కమర్షియల్ రియల్ టైమ్ ఆపరేటింగ్ సిస్టమ్ అయిన ఖ్యూ యెన్ ఎక్స్ ఆధారిత ఎంబెడెడ్ రియల్ టైమ్ సిస్టమ్స్ పై స్టూడెంట్ ఓరియంటేషన్ ప్రోగ్రామ్‌ను నిర్వహించింది. మిట్స్ పాఠ్యాంశాల్లో ఖ్యూ యెన్ ఎక్స్ ఆధారిత ఎంబెడెడ్ రియల్ టైమ్ ఆపరేటింగ్ స్ట్రీమ్ లను అమలు చేయడానికి కళాశాల పై స్క్వేర్ టెక్నాలజీస్‌తో ఒక అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ కార్యక్రమం లో స్క్వేర్ టెక్నాలజీస్ దినివీ శ్రీనివాస్ రాజు, ఖ్యూ యెన్ ఎక్స్ ఎవీవేర్ డైరెక్టర్ దశరథ్ ఏం మరియు స్క్వేర్ టెక్నాలజీస్ సిస్టమ్స్ అనలిస్ట్ మధుసుధన్ లు ఈ కార్యక్రమం లో పాల్గొన్నారు. కార్యక్రమం లో ముందుగా శ్రీనివాస్ రాజు మాట్లాడుతూ ఎంబెడెడ్ సిస్టమ్స్ ప్రపంచంలో, రియల్‌టైమ్ పనితీరు, భద్రత, విశ్వసనీయత మరియు మాడ్యులారిటీ చాలా ముఖ్యమైనవి అని అన్నారు. శీవిశ్రీ సాఫ్‌వేర్ సిసమ్స్ అభివృద్ధి చేసిన QNX రియల్‌టైమ్ ఆపరేటింగ్ సిస్టమ్, ఆటోమోటివ్, మెడికల్, ఇండస్ట్రియల్ ఆటోమేషన్, ఏరోస్పేస్ మరియు కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ వంటి పరిశ్రమలలో ఎంబెడెడ్ అప్లికేషన్‌ల కోసం విస్తృతంగా స్వీకరించబడిన ప్లాట్‌ఫామ్ అని అన్నారు. ఎంబెడెడ్ రియల్‌టైమ్ సిస్టమ్‌లను అభివృద్ధి చేయడానికి QNXను ప్రాధాన్యత ఎంపికగా చేసే ముఖ్య ప్రయోజనాలు క్రింద ఇవ్వబడ్డాయి అని అన్నారు. కార్యక్రమం లో వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ రామనాథన్ కో ఆర్డినేటర్ డాక్టర్ సి. కుమార్ విభాగాధిపతి డాక్టర్ రాజశేఖరన్ తదితరులు పాల్గొన్నారు.

## హాజీమీర్ దర్గాలో వైకాపా నాయకులు పూజలు

**మదనపల్లె, జులై 4 ప్రభాతవార్త :**


హజ్మీర్ ఛాదా సమర్పిస్తున్న దృశ్యం

మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మళ్ళీ ముఖ్యమంత్రి కావాలని, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబాలకు మంచి జరగాలని హజ్మీర్ దర్గాలో మదనపల్లె వైకాపా నియోజకవర్గ ఇన్‌చార్జ్ నిస్సార్‌అహ్మద్ పూజలు చేసి ఛాదర్ సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో అనేక ప్రజా వ్యతిరేక విదానాలు చేపడుతూ, అరాచకాలు, దాడులు, దౌర్జన్యాలు పాల్పడుతోందన్నారు. వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆత్మసైర్యం, అల్లా ఆశీస్సులు ఉండాలని హజ్మీర్‌లో పూజలు చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్న విధానం వల్ల వైకాపా నాయకులు, కార్యకర్తలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కూటమి ప్రభుత్వంచేస్తున్న అరాచకాలపై వైసిపి చేస్తున్న పోరులో విజయం సాధించాలని తెలిపారు. ప్రపంచంలోనే అజ్మీర్ దర్గా ఎంతో పవిత్రమైందని రాష్ట్ర ప్రజలకు మంచి జరగాలని కోరుకొన్నట్లు తెలిపారు.

## ఎమ్మెల్యే, సబ్‌కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న దృశ్యం

**మదనపల్లె, జులై 4 ప్రభాతవార్త :**
సబ్‌కలెక్టరేట్‌కార్యాలయంలో శుక్రవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మామిడి రైతుకు కిలో రూ.4ల సబ్సిడీ ఇస్తూ ప్రభుత్వం తీసుకొన్న నిర్ణయాన్ని విడియో కాన్ఫరెన్స్ ద్వారా తెలియజేశారు. తీవ్ర నష్టాల బాటలో ఉన్న మామిడి రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ఈ చర్యలు తీసుకొందని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. మామిడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వం రూ.4లు కొనుగోలు చేసే విధంగా నిర్ణయం తీసుకొన్నట్లు తెలిపారు. ఫ్యాక్టరీలో రూ.8లు రైతులకు ఇచ్చి కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోనున్నట్లు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. వైకాపా నాయకులు చేస్తున్న విమర్శలను ఆయన తప్పుపట్టారు. ప్రభుత్వం రైతులను అన్ని విధాల ఆదుకునేందుకు చర్యలు చేపడుతుందన్నారు.

## మహతి కాలేజ్ ఆఫ్ పార్మసిలో జాతీయ సదస్సు



**మదనపల్లె, జులై 4 ప్రభాతవార్త :**
మదనపల్లె సమీపంలోని మహతి కాలేజ్ ఆఫ్ ఫార్మసిలో జంతు పరిశోదన నైతికతపై శుక్రవారం జాతీయ సదస్సు నిర్వహించారు. దేశ వ్యాప్తంగా 320మంది ప్రతినిధులు ఈ జాతీయ సదస్సుకు హాజరయ్యారు. సదస్సును ప్రిన్సిపాల్ డాక్టర్ పికె.ప్రకాష్‌రెడ్డి, సిసిఎస్ఈఏ ప్రతినిధి డాక్టర్ ఈశ్వర్‌తోని సంయుక్తంగా ఈ సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిధిగా మహతి కాలేజ్ ఆఫ్ ఫార్మసి ఛైర్మెన్ బి.అమరనాథ్‌రెడ్డి, వైస్‌ఛైర్‌పర్సన్ డాక్టర్ మహతిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు పరిశోదన నాణ్యతకు నైతికత ప్రధానమని పేర్కొన్నారు. జంతు సంక్షేమంపై డాక్టర్ సోమశేఖర్‌రెడ్డి సూత్రాలు, ప్రత్యామ్నాయ పద్ధతిపై డాక్టర్ హుస్సేన్‌సాహెబ్ నైతిక సవాళ్ళను ప్రాక్టికల్‌గా ఎలా ఎదుర్కోవాలో వివరించారు. డాక్టర్ వినోద్ నెలసన్ మహతి కాలేజ్ ఆఫ్ పార్మసిలో లభించే ఆధునిక పరిశోదనలపై సమగ్రంగా వివరించారు. ఈ సదస్సులో అధ్యాపకులు, పరిశోదకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు


సీతారామరాజు జయంతిని నిర్వహిస్తున్న దృశ్యం

**రామసముద్రం, జులై 4 ప్రభాతవార్త :**
బ్రిటీష్ సామ్రాజ్యాన్ని భారతదేశంలో గడగడలాడించిన స్వాతంత్ర సమరయోదుల్లో అల్లూరి సీతారామరాజు గొప్ప యోదునిగా పేర్కొంటు అల్లూరి సీతారామరాజు 128వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. క్షత్రియ జాతి గర్తించదగ్గ వీరుడని, సాయుధ పోరాట దీరుడని, మన్యం వీరుడని స్వాతంత్ర్య సమరానికి అగ్నిజ్వాల అంటించిన అల్లూరిని ప్రతి భారతీయుడు స్మరించుకోవాలని మండలంలోని క్షత్రియ సోదరులు పిలుపునిచ్చారు. శుక్రవారం మండల పరిధిలో రాజగుండ్లపల్లె,బైరాజులపల్లె, నల్లచిన్నెపల్లె, తిరుమలరెడ్డిపల్లె, మాలేనత్తం, మానేవారిపల్లె గ్రామాలో అల్లూరి సీతారామరాజు జయంతిని ఘనంగా జరుపుకొన్నారు. ఈ వేడుకల్లో శంకర్‌రాజు, లోకేష్‌రాజు, రామరాజు, యువరాజు, తిమ్మలరాజు, విశ్వనాథ్‌రాజు, గోఫి, రామచంద్ర రాజు, రెడ్డప్పరాజు, నారాయణ రాజు, చైతన్య రాజు, మురళి క్రిష్ణమరాజు, చలపతిరాజు, తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**రామసముద్రం, జులై 4 ప్రభాతవార్త :**
రామసముద్రం మండలం వ్యప్తంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని మదనపల్లె ఈఈ గంగాధరం, ఏఈ మస్తాన్‌లు తెలిపారు. మండలంలో ఉదయం 10గంటల నుంచి 12గంటల వరకు సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు. మండల సబ్‌స్టేషన్‌లో మరమ్మత్తు చేపడుతుండడంతో ప్రజలు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు. ప్రజలు సహకరించాలని అధికారులు కోరారు.

## రెండు కార్లు ఢీకొని మహిళకు తీవ్రగాయాలు

**రామాపురం జూలై 04 ప్రభాత వార్త**
కర్నూలు చిత్తూరు 40 వ జాతీయ రహదారిలోని రామాపురం మండలం నల్లగుట్టపల్లిపంచాయతీ పరిధిలోనే నర్సరీ సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రెండు కార్లు ఢీకొని లక్ష్మీ ప్రసన్న అనే మహిళకు త్రీవ గాయాలైనట్లు పోలీసులు తెలిపారు పోలీసులు కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కనిగిరి చెందిన స్వామి కారులో కనిగిరి నుంచి రాయవరం వస్తుండగా మార్గమధ్యంలో రాగానే రామాపురం మండలం నల్లగుట్టపల్లి నర్సరీ సమీపానికి రాగానే ఎదురుగా వస్తున్న కారును ఢీకొంది. ఈ ప్రమాదంలో మహిళకు మహిళలకు తీవ్ర గాయాలయ్యాయి. సంఘటన స్థలానికి రామాపురం పోలీసులు చేరుకొని గాయపడిన మహిళను చికిత్స నిమిత్తం108 వాహనంలో రాయచోటి ప్రభువు ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రామాపురం పోలీసులు తెలిపారు.

## సంక్షేమ పథకాలకు నాంది పలికింది తెలుగుదేశం

**రామపురం జూలై 05. ప్రభాతవార్త**
దేశంలోనే సంక్షేమ పథకాలకు నాంది పలికినపార్టీ తెలుగుదేశం అని ఐటీడీపీ ఛాంపియన్ నాగభూషణ్ రెడ్డి అన్నారు మండలంలోని రాచపల్లి పంచాయతీ 60 పోలింగ్ బూత్ పరిధిలో గురువారం సుపరిపాలన తొలి అడుగు 4.1 డోర్ టు డోర్ కార్యక్రమాన్ని నిర్వహించారు సందర్భంగా ఆయన మాట్లాడుతూ రవాణా యువజన క్రీడామంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సూచనల మేరకు ఇంటికి వెళ్లి తెలుగుదేశం పార్టీ నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి గా ప్రజల కోసం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల ఫలాలు అందినవా లేవా? అని అడుగుతూ వారి సమస్యలను అడిగి తెలుసుకుంటూ బూతు లెవల్ లో ఇంటింటికి వెళ్లి ఇంటిలోని వృద్ధులకు నెల నెల ఒకటో తేదీన 4000 పెన్షన్ దివ్యాంగులకు6000 పెన్షన్ వస్తుందా లేదా ఉచిత గ్యాస్ తల్లికి వందనం ఇంటిలో ఎంతమంది పిల్లలు చదువుతున్న అందరికీ డబ్బులు పడ్డాయా లేదా తెలుసుకుంటూ ఎలాంటి సౌకర్యాలు కావాలి తెలుసుకొని ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమం అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూను పరిపాలనలో తొలి అడుగు కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రజల అభిప్రాయాలను మై టిడిపి యాప్ లో అప్డేట్ చేసి గ్రామంలోపర్యటించారు ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గంగిరెడ్డి లక్ష్మిరెడ్డి భాస్కర్ రెడ్డి వేణుగోపాల్ రెడ్డి మదన వేణుగోపాల్ కిరణ్ కుమార్ రెడ్డి రామ్మోహన్ రెడ్డి రవి కాసిం పీరా కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇద్దరు విద్యార్థులపై దాడి

**పీలేరు జూలై 4 ప్రభాతవార్త:**
ఇద్దరు విద్యార్థులపై కత్తితో దాడి చేసిన సంఘటన శుక్రవారం పీలేరు పట్టణం కడప రోడ్డులో చోటు చేసుకుంది. వివరాలిలావున్నాయి. మండలంలోని యర్రగుంటపల్లె పంచాయతీ నెట్టిబండ కాలనీకి చెందిన వి. సంతోష్ (16), సైనిక్ నగర్‌కు చెందిన శశినాయక్ (19) స్థానికంగా ఓ ప్రయివేట్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. అదే కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న హర్షవర్ధన్, రిహాన్ గొడవ పడ్డారు. హర్షవర్ధన్ సోదరుడైన సంతోష్ వారిని వారించాడు. దీంతో రిహాన్ స్నేహితులు సాదిక్ ఉల్లా, తన స్నేహితులు ఐదు మందితో వచ్చి ఇరువురిపై కత్తితో దాడి చేశారు. గాయపడ్డ ఇరువురిని చికిత్స నిమిత్తం పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ యుగంధర్ తెలిపారు

## వాహనాలను తనిఖీ చేసిన సిఐ రమణారెడ్డి



**మైదుకూరు, జులై 04, ప్రభాతవార్త:**
శ్రీకృష్ణదేవరాయల సర్కిల్లో పల్సు వాహనాలను తనిఖీ చేసిన సిఐ రమణారెడ్డి,త్రిబుల్ రైడింగ్, హెల్మెట్ పై,విద్యార్థులు, మైనర్లు, వాహనదారులకు అవగాహన కల్పిస్తూ రూల్స్ అతిక్రమించిన వారికి ఫైన్ వేయడం జరిగింది. బద్వేల్ రోడ్డు ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా రహదారిపై తోపుడు బండ్లు, వాహనాలు, బోర్డులు, రహదారిపై అడ్డుగా పెట్టకూడదని కౌన్సిలింగ్ చేస్తూ పలు సూచనలు చేశారు. వనిపెంట గ్రామంలో స్థానిక సమస్యలపై పెద్దలు, యువకులకు, అవగాహన కలిగి సమస్యలపై గొడవలు కాకుండా పోలీస్ వారి దృష్టికి తీసుకురావాలని దొంగతనాలు, కొత్త వ్యక్తుల సమాచారం పోలీస్ స్టేషన్ కు సమాచారం ఇవ్వాలని అవగాహన కల్పించారు. వనిపెంట మహాత్మా గాంధీ బీసీ వెల్ఫేర్ బాలికల రెసిడెన్షియల్ స్కూల్ నందు విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకుని విద్యార్థులకు అవేర్నెస్ ప్రోగ్రాం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నిర్మల, విద్యార్థులు, సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ ఉద్యోగ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


నిరసన తెలుపుతున్న ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు

**పీలేరు జూలై 4 ప్రభాతవార్త :**
స్థానిక డిపో ప్రాంగణంలో ఏపీఎస్ ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం గ్యారేజ్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా డిపో అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.కె. బాషా, ఆర్.వి. రమణ మాట్లాడుతూ ఎలక్ట్రికల్ బస్సులు ఆర్టీసీ ద్వారానే కొనుగోలు చేయాలన్నారు. 1/2019 సర్క్యులర్ ను యదావిధిగా కొనసాగించాలన్నారు. డీఏ బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. గత ఆరు సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్న పదోన్నతులు పూర్తి చేయాలని కోరారు. కాలం చెల్లిన ఆర్టీసీ బస్సులు బ్రేక్ డౌన్ పై గ్యారేజీ సిబ్బందిపై ఇస్తున్న చార్జీసీట్లు రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈయూ కోశాధికారి వేణుగోపాల్ రెడ్డి, డెలిగేట్స్ కె.వి. రమణ, నాయకులు ఎస్.ఎం. బాషా,కుమార్, పురుషోత్తం, శ్రీరాములు, ఎస్.వి. రమణ, రాధ, శోభారాణి, రవినాయక్, అరుణమ్మ ఉద్యోగ కార్మికులు పాల్గొన్నారు.

## సచివాలయ సిబ్బంది సేవలు మరువ లేనివి



**రామాపురం జూలై 05 ప్రభాతవార్త**
మండలంలోని గోపగుడిపల్లి గ్రామ సచివాలయ ఉద్యోగుల సేవలో మనులేనివని గ్రామ సర్పంచ్ ముంగర సరోజమ్మ గ్రామ నాయకుడు ముంగర సుబ్బయ్య పేర్కొన్నారు గోపగుడిపల్లి గ్రామ సచివాలయంలో పనిచేస్తున్న సిబ్బంది బదిలీపై వెళ్లడంతో వారిని సర్పంచ్ సరోజమ్మ గ్రామ నాయకులు ప్రజలు ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ సచివాలయ వ్యవస్థ ఏర్పడినాటినుండి తమ గ్రామంలో పనిచేస్తూ ప్రజలకు సేవలు అందించిన సిబ్బంది బదిలీపై వెళ్తుంటే కొద్దిగా బాధగా ఉన్నా ఉద్యోగస్తులకు బదిలీలు సర్వసాధారణం అన్నారు ఎక్కడ పని చేసినా ప్రజలమార్నానలు పొందుతూ ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో సత్యనారాయణ బలరామయ్య వెంకటరామరాజు రామానుజులు చెన్రాయుడు ప్రసాద్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## రాబిస్ టీకాలు కార్యక్రమం

**కలికిరి జూలై 4 ప్రభాతవార్త:**
జూలై 6వ తేదిన జూనోసిస్ డే సందర్భంగా మండలంలోని అన్ని పశు వైద్యశాలలో Rabies వ్యాధి టీకాలు వేయు కార్యక్రమం జరగనున్నది. జంతువుల నుండి మనుషులకు సంక్రమించే ప్రాణాంతకమైన వ్యాధులలో పిచ్చి కుక్క కాటు వ్యాధి ముఖ్యమైనది. ఈ వ్యాధికి నివారణ తప్ప చికిత్స లేదు. మండలంలోని అన్ని పశువైద్యశాలలో పెంపుడు కుక్కలకు మరియు పిల్లలకు ఈ వ్యాధి నివారణ టీకాలు వేయబడతాయి. అలానే ప్రాంతీయ పశు వైద్యశాల కలికిరి నందు ఉదయం 10 గంటలకు టీకాలు వేయడంతో పాటు జంతువుల నుండి మనుషులకు సంక్రమించే వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించబడుతుందని డాక్టర్ కె. వెంకట ముని నాయుడు, సహాయ సంచాలకులు, ప్రాంతీయ పశువైద్యశాల కలికిరి మండలం వారు తెలియజేశారు.

## 11వ రేషన్ షాపులు తనిఖీ

**లక్కిరెడ్డిపల్లి; జూలై 4 , ప్రభాతవార్త**
మండల కేంద్రంలో లక్కిరెడ్డిపల్లి లోని 11వ రేషన్ షాపును శుక్రవారం విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు విజిలెన్స్ అధికారి శివన్న ఆధ్వర్యంలో రేషన్ బియ్యం లో వెత్తేశాలు ఉన్నాయని అందులో 159 కేజీలు బియ్యం అధికంగా ఉన్నాయని దీంతో బియ్యం ను స్వాధీనం చేసుకొని స్థానిక తాసిల్దార్ క్రాంతి కుమార్ కుమార్ కు అప్పగించారు ఈ కార్యక్రమంలో విజిలెన్స్ అధికారులు అసిస్టెంట్ డిటి తదితరులు పాల్గొన్నారు

## సూర్యఘర్ యోజన సద్వినియోగం చేసుకోండి

**పీలేరు జూలై 4 ప్రభాతవార్త :**
ప్రధాన మంత్రి సూర్యఘర్ యోజన పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఆర్డీఏ పీడీ సత్యనారాయణ అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీలేరు నియోజకవర్గంలో 11500 మంది దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నట్లు గుర్తించామని, వీరిని బంగారు కుటుంబాలకు గుర్తించడం, పీ4 విధానంలో ఆ కుటుంబాల జీవన ప్రమానాల పెంపుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి ఉద్యోగి తమ ఇళ్లపై సూర్యఘర్ యోజన సోలార్ ఏర్పాటు చేసుకుని ప్రజలకు ఆదర్శంగా నిలవాలన్నారు. ఒక కిలో వాట్ యూనిట్ ఏర్పాటుకు రూ. 2 లక్షలు వ్యయం కాగా 80 శాతం బ్యాంకు రుణంగా పొందవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో ఈఈ చంద్రశేఖర్ రెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ రామ్మూర్తి, శ్రీకాంత్ రెడ్డి, అమరనాథరెడ్డి మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న పిడి సత్యనారాయణ

# ఆర్టీసీ ఉద్యోగుల ప్రధాన సమస్యలను పరిష్కరించాలి



మైదుకూరు, జులై 04, ప్రభాతవార్త:
రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు డిపో నందు ఎర్ర బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరై గేట్ మీటింగ్ నిర్వహించిన ఆర్టీసీ ఎంప్లాయిస్ ఉద్యోగులు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రీజనల్ అధ్యక్షుడు మల్లికార్జున మరియు డిపో అధ్యక్షుడు ఎం. నారాయణ,ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఉద్యోగుల ప్రధాన సమస్యలు తీర్చాలని వాటిలో పదోన్నతులు, ఎలక్ట్రికల్ బస్సులను ఆర్.టి.సి సొంతముగా ప్రభుత్వ సహాయ సహకారాలతో కొనుగోలు చేసి ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యము కల్పించాలి, బస్సులను ఆర్.టి.సి సిబ్బందితో నడపాలని, బస్సుల నివారణ కొరకు డిపో ప్రైవేటు ఆపరేటర్లకు లీజుకు ఇచ్చే విధానాన్ని విరమించుకోవాలి, ప్రభుత్వము ద్వారా ఇవ్వవలసిన పెండింగ్ డి.ఎ బకాయిలు11వ పీఆర్సీ అరియర్స్ 24 నెలల బకాయిలను వెంటనే ఆర్టీసీ ఉద్యోగులకు చెల్లించాలి,12వ పిఆర్సి కమీషన్ ను నియమించి ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఐర్ ప్రకటించాలి,రిటైర్డ్ అయిన ఆర్టీసీ ఉద్యోగులకు గ్రాట్యుటీ, టెర్మినల్ ఎన్ క్యాష్ మెంట్ను ప్రభుత్వం చెల్లించేలా చర్యలు తీసుకోవాలి, ఎస్ఆర్బి ఎస్/ఎస్బిటి బకాయిలను వెంటనే చెల్లించాలి, ఎస్ ఆర్బిఎస్‌కు 18 వడ్డీతో బకాయిలు చెల్లించాలి,డబల్ డ్యూటీ చేస్తున్న ఉద్యోగులకు డిడి అమోంట్ పెంచాలి,టిమ్స్ డామేజీలపై ఇస్తున్న రికవరీలను వెంటనే నిలుపుదల చేయాలి. రికవరీలు ఇవ్వకుండా చర్యలు తీసుకోవాలి, కాలం చెల్లిన బస్సుల బ్రేక్ డౌన్కు గ్యారేజ్ సిబ్బందిని బాధ్యులను చేసి అక్రమంగా పనిష్ మెంట్లు ఇస్తున్న విధానాన్ని అరికట్టాలి, ఈ హెచ్ ఎస్ ద్వారా సరైన వైద్య సౌకర్యాలు అందనందున ఆర్టీసీ ఉద్యోగులకు విలీనంకు ముందున పాత పద్ధతుల్లోనే వైద్య సౌకర్యాలు అందజేయాలి, సర్క్యులర్ నెం : పిడి. 01/2019 అమలు చేయుటకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసి అమలు జరిగేలా చూడాలి, సిసిఎస్ కార్యాలయము ఉద్యోగుల అందుబాటులో ఉండేలా ఆర్టీసీ హౌస్ లోనే కొనసాగాలి,నాన్ ఆపరేషన్ యూనిట్లలో సిసిఎస్ డెలిగేట్ల తగ్గింపు కొరకు పాలకమండలి తీసుకున్న నిర్ణయాన్ని నిలుపుదల చేసి ముందున్న పద్ధతిలోనే డెలిగేట్లు ఉండేలా చర్యలు తీసుకోవాలి, సిసిఎస్ నందు జరుగుచున్న నిధుల దుర్వినియోగముపై తగు విచారణ జరిపించి నిధులు దుర్వినియోగము కాకుండా తగిన చర్యలు తీసుకోవాలి. సొసైటీని కాపాడుటలో సొసైటీ ఛైర్మెన్ గా తమరు బాధ్యతలు తీసుకోవాలి, ఏడి/పిడి/ఎస్ పి డి క్లరికల్ సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కరించుటకు తగిన చర్యలు తీసుకోవాలి, అన్ని వర్క్ షాపులలో నెలవారీ మూవింగ్ యావరేజ్ టి.ఆర్.ఎస్ మాదిరిగా అమలు కొరకు వెంటనే చర్యలు తీసుకోవాలి. పెండింగు ఉన్న మూవింగు యావరేజ్ చెల్లించాలని మైదుకూరు డిపో బి మటం సర్వీసు సరైన రన్నింగ్ టైం ఇవ్వాలి, డిపో మేనేజర్ కార్యాలయంలో ఓడిని రద్దు చేయాలని డిపో కార్యదర్శి టిపి మునయ్య మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డిపో కార్యదర్శి టి.పి.మునయ్య ట్రెజరర్ కె.నరసింహులు గ్యారేజ్ కార్యదర్శి పుల్లారెడ్డి, ఆర్టీసీ ఉద్యోగులు ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

## వైభవంగా పగటి పీర్ల ఉత్సవం



పెనగలూరు జూలై 4 ప్రభాతవార్త
మొహరం పండుగ ఉత్సవాలలో భాగంగా మండలంలోని పి కొత్తపల్లి ఓబిలి నలపరెడ్డిపల్లి నారాయణ నెల్లూరు నాయుడువారిపల్లి గ్రామాలలో పగటి పీర్ల ఉత్సవం వైభవంగా జరిగింది. హిందూ ముస్లిం, నూర్ భాషా దూదేకుల సంఘం సభ్యుల ఆధ్వర్యంలో పగటి పీర్ల ఊరేగింపు కార్యక్రమం ఘనంగా జరిగింది. భక్తులు పేర్లకు బెల్లం,చక్కెర ప్రసాదాలను సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మొహర్రం ఉత్సవాలలో భాగంగా శుక్రవారం రాత్రి స్థానిక పీర్ల చావిడిలవద్ద చిన్న సర్గిస్ ఉత్సవాలను ఘనంగా జరుపుకునేందుకు స్థానికులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు పి కొత్తపల్లి లోని అటల్ సాహెబ్, బాదుల్లా, వెండి పీర్లతోపాటు ఓబిలి నల్లపురెడ్డిపల్లి నాయుడు వారి పల్లి నారాయణ నెల్లూరు గ్రామాలలోని అస్సాన్, ఉస్సేన్ పేర్లకు బాసికాలు, శారాలు, పానకం దుత్తలు, గజమాలలు సమర్పించుకునేందుకు భక్తులు సమాయత్తమవుతున్నారు. అలాగే చిన్న అగ్నిగుండం కార్యక్రమాలను కూడా జరుపుకోనున్నట్లు నిర్వాహకులు తెలయ చేశారు.

## సుపరిపాలనలో తొలి అడుగులో మంత్రి



చిన్నమండెం,జులై 04 ప్రభాతవార్త :
చిన్నమండెం మండలం, కేశాపురం, దేవళంపేట గ్రామలలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రవేశపెట్టిన సుపరిపాలనలో తొలి అడుగు డోర్ టు డోర్ కార్యక్రమంలో భాగంగా అనారోగ్యంతో బాధపడుతున్న పలువురు టిడిపి కార్యకర్తల లను పరామర్శించి నూతన బోర్ వెల్ ను రాష్ట్ర రవాణా యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రారంభించారు . తర్వాత గ్రామంలోని ఇంటింటికి డోర్ టు డోర్ కార్యక్రమం నిర్వహించి ప్రభుత్వం అందించే పథకాలను, అభివృద్ధి చేసిన పనుల గురించి ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల, గ్రామ టిడిపి నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు.

## ఘనంగా అల్లూరి జయంతి



రైల్వే కోడూరు రూరల్, జులై 4 ప్రభాతవార్త:
పట్టణంలోని ప్రధాన రహదారి వద్ద ఉన్న అల్లూరి విగ్రహం వద్ద శుక్రవారం అల్లూరి జయంతోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రైల్వే కోడూరు కూటమి నాయకులైన ఎమ్మెల్యే అరవ శ్రీధర్, కుడా ఛైర్మన్ ముక్కా రూపానందరెడ్డి, డిసి ఎమ్మెస్ జయప్రకాష్ ఎర్రగుండ్ల జయప్రకాష్, బిజెపి నాయకులు గడ్డం చెంగల్ రాజు జయప్రకాష్ నారాయణ వర్మ ,వాకచర్ల సుబ్బారావు తో పాటు జనసేన నాయకులు తాతంశెట్టి నాగేంద్ర మరియు క్షత్రియ సంఘం నాయకులు సంగ రాజు రవికుమార్ రాజు, గంగరాజు వెంకటేశ్వరం రాజు, పందేటి వెంకటరామరాజు ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు జయింతోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగు దేశానికి చెందిన అబ్బర్వర్ మిర్యాల జ్యోతి మాజీ సర్పంచ్ పుష్పలత మైనార్టీ నాయకురాలు సయ్యద్ మెహతాజ్ బేగం, పుల్లంపేట టిడిపి నాయకురాలు సౌభాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

## మా ప్రభుత్వ పనితీరు ఎలా ఉంది తల్లీ



తంబళ్లపల్లె జూలై 4 ప్రభాతవార్త ః
మా కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది అయింది మా ప్రభుత్వ పనితీరు ఎలా ఉంది తల్లీ అని ఓ మైనారిటీ మహిళ ను తంబళ్లపల్లె టిడిపి ఇంచార్జ్ జయచంద్రారెడ్డి అడగ్గా చాలా బాగుందని ఆయనకు పూలమాలవేసి శాలువతో సన్మానం చేయడంతో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. శుక్రవారం సుపరిపాలన కు తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా తంబళ్లపల్లె క్రాస్ రోడ్లో ఇంటింటికి జయచంద్రారెడ్డి తిరిగి తమ ప్రభుత్వ పనితీరును అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరిని ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలు అందుతున్నాయా సమస్యలు ఏమైనా ఉన్నాయా అధికారులు పరిష్కరిస్తున్నారా అని ప్రశ్నల వర్షం కురిపించారు. ప్రతి ఒక్కరూ సంక్షేమ పథకాలు విధిగా అందుతున్నాయని సమస్యల పరిష్కారంలో అధికారులు సహకరిస్తున్నారని చెప్పారు. గత ప్రభుత్వంలో అధికారులు డమ్మీలై నాయకుల పెత్తనం జరిగేదని నేడు అధికారులు, అధికార పార్టీ నాయకుల సహకారంతో సకాలంలో పెన్షన్, ప్రభుత్వ పథకాలు పంపిణీ సజావుగా నిర్వహిస్తున్నట్లు చెప్పడంతో హర్షధ్వానాలు మిన్ను ముట్టాయి. ఆయన వెంట మండల పార్టీ అధ్యక్షుడు రెడ్డప్ప రెడ్డి, క్లస్టర్ ఇన్చార్జిలు బేరి శ్రీనివాసులు, బిఎంఆర్, కాలా నారాయణ, పురుషోత్తం, ఉత్తమ రెడ్డి, రామచంద్ర, నరసింహులు, మ్యూజికల్ శివ, మణి, రామాంజులు, గ్రామ కమిటీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



ఒంటిమిట్ట జూలై 03( ప్రభాతవార్త)
జాతీయ డెంగ్యూ మాసవోత్సవం కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలో ఉన్న కొత్త మాధవరం గ్రామంలోని జిల్లా పరిషత్ ప్రధాన పాఠశాలలో వైద్య సిబ్బంది పరిశుభ్రతకై విద్యార్థులకు అవగాహన కలిగించేందుకు సమావేశం నిర్వహించారు. ప్రాథమిక కేంద్ర వైద్యులు లోకమాన్ వీరేంద్ర సింగ్ ఆధ్వర్యంలో సిబ్బంది నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది పాఠశాల విద్యార్థిని విద్యార్థులతో మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రత పరిసరాల శుభ్రత సీజన్లో వచ్చే వ్యాధుల గురించి డెంగ్యూ వ్యాధి గురించి కీటక జనిత వ్యాధుల గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకొని ఉండాలని సూచనలు పాటించాలని తెలియజేశారు. సిద్ధవటం సబ్ యూనిట్ ఆఫీసర్ సుబ్బరాయుడు మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రై డే ఫ్రైడే పాటించాలని పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని రాత్రి వేళల్లో దోమతెరలు వాడుకొని దోమల నుంచి రక్షణ పొంది ఆరోగ్య సూత్రాలను పాటిస్తూ ఆరోగ్యంగా ఉండి సుఖ జీవనం సాగించాలన్నారు. డెంగ్యూ వ్యాధి వ్యాప్తి, నివారణ మార్గాల గురించి తెలియజేయడం జరిగింది. ఒంటిమిట్ట ఆరోగ్య కేంద్రం సూపర్వైజర్ భాస్కర్ రెడ్డి పరిసరాల పరిశుభ్రత గురించి దోమల వ్యాప్తి నిర్మూలన గురించి తెలియజేశాడు. అదేవిధంగా దోమలు ఎక్కడ వ్యాప్తి చెందుతాయో ఆ ప్రదేశాల్లో దోమల నిర్మూలన పిచికారి మందులను ఉపయోగించి దోమల నిర్మూలన గురించి ప్రస్తావించడం జరిగింది. దోమలకు నిలయమైన ప్రదేశాలను గుర్తించి వ్యాప్తి కాకుండా పిచికారి మందులను ఉపయోగించాలని ప్రజల ఆరోగ్యాలను కాపాడాలని వైద్యశాల మహిళా సూపర్వైజర్ లక్ష్మీనరసమ్మకు ఆయన తెలియజేశాడు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు అంబేద్కర్,ఎంఎల్ హెచ్ పి సి హెచ్ ఓ వనిత, ఆశా వర్కర్లు తదితర సిబ్బంది పాల్గొన్నారు.

## జన్ సురక్షా పథకాలపై అవగాహన



ముద్దనూరు, జులై 04, ప్రభాతవార్త:
కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రధానమంత్రి జీవన్ జ్యోతి, భీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన,అటల్ పెన్షన్ యోజన వంటి తదితర పథకాలను గ్రామ స్థాయి వరకు తీసుకువెళ్లే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని కొర్రపాడు గ్రామ సచివాలయంలో జిల్లా అధికారుల వీడియో కాన్ఫరెన్స్ ద్వారా యూనియన్ బ్యాంక్ మేనేజర్ సుదర్శన్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఖాతాదారులు కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న బీమా పథకాలను తప్పకుండా వినియోగించుకోవాలని, సైబర్ నేరాల పై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది, సచివాలయ సిబ్బంది గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## అల్లూరికి పోతుగుంట నివాళి

(అన్నమయ్య ప్రతినిధి ప్రభాతవార్త)



మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు పోతుగుంట రమేష్ నాయుడు శుక్రవారం రాజంపేటలోని ఆర్ అండ్ బి బంగ్లా దగ్గర ఉన్న అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించడం జరిగింది. ఈ సందర్భంగా రమేష్ నాయుడు మాట్లాడుతూ భారతమాత బానిస సంకెళ్లను త్రెంపుటకు ఆంగ్లేయులనెదిరించిన ధీరుడన్నారు. తన జీవితాన్ని దేశమాత స్వేచ్ఛ కోసం సమర్పణ చేసిన మన్యం వీరుడన్నారు. అణువణువునా దేశభక్తినీ, ఆత్మ లోని జీవశక్తిని నింపుకొన్న అరివీర భయంకరుడన్నారు. ఆంగ్లేయుల తూటాలకు ఎదురు నిలిచి బాణమై నిలిచిన రుద్రుడన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి ఓబీసీ మధ్య రాష్ట్ర అధికార ప్రతినిధి పట్టుకోగల ఆదినారాయణ, బిజెపి రాష్ట్ర నాయకులు హిమగిరి యాదవ్, బిజెపి పట్టణ అధ్యక్షులు వివి రమణ, బిజెపి మండల ఉపాధ్యక్షులు ప్రసాద్ రాజు, బిజెపి పట్టణ ప్రధాన కార్యదర్శి ఎం గిరీష్ బీజేపీ నాయకులు తోట నగేష్ పట్టణ ఉపాధ్యక్షులు రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నేడే జాతీయ లోక్ అదాలత్

పీలేరు జూలై 4 ప్రభాతవార్త:
పీలేరు న్యాయస్థానంలో ఈ నెల 5న శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు పీలేరు ఇంచార్జ్ 11వ అదనపు జిల్లా జడ్జి పివిఎస్ సూర్య నారాయణ మూర్తి శుక్రవారం తెలియజేశారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకుని తమ కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు. జాతీయ లోక్ అదాలత్ లో రెండు బెంచులు ఏర్పాటు చేస్తున్నామని, మొదటి బెంచ్ లో చిత్తూరు ఫోక్సో కోర్టు జడ్జి ఎం. శంకర్రావు, రెండవ బెంచ్ లో ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి ఎస్. శ్రీనివాసు నిర్వహిస్తారని పేర్కొన్నారు.

## ఉన్మాదులను శిక్షించాలి



మాట్లాడుతున్న బాస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పాలకుంట శ్రీనివాసులు

పీలేరు, జూలై 4 ప్రభాతవార్త:
అన్నమయ్య జిల్లా, ,మదనపల్లి మండలం, అంకిశెట్టిపల్లి పంచాయతీలోని బుద్ధుని కొండలో బుద్ధుడి విగ్రహాన్ని ధ్వంసం చేసిన ఉన్మాదులను కఠినంగా శిక్షించాలని భారతీయ అంబేద్కర్ సేన రాష్ట్ర ఉపాధ్యక్షులు పాలకుంట శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం పీలేరు బాస్ కార్యాలయంలో ఆయన బిస్మిల్లా ఆటో యూనియన్ రా సిష్ట్ర అధ్యక్షులు బోదేషా వలి తో కలసి మీడియాతో మాట్లాడుతూ బుద్ధుడి విగ్రహాలపై ఇలా పలుమార్లు దాడులకు పాల్పడుతున్న ఉన్మాదులను వెంటనే గుర్తించి, అరెస్టు చేయాలని కూడా డిమాండ్ చేశారు. మదనపల్లిలోని బుద్ధుని కొండను మానవ వికాస కేంద్రంగా, గొప్ప ఆధ్యాత్మిక చైతన్య కేంద్రంగా తీర్చి దిద్దాలన్న ఉన్నతాశయంతో బాస్ వ్యవస్థాపకులు పిటిఎం శివప్రసాద్ ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి బుద్ధుని కొండలో ఒక్కొక్కటిగా నిర్మాణాలు చేపడుతుంటే, కొంతమంది ఉన్మాదులు ఒక్కొక్కటిగా ధ్వంసం చేస్తూ వస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కూడా మూడు బుద్ధుని విగ్రహాలను ధ్వంసం చేశారని, తిరిగి గత రెండు రోజుల క్రితం మరో మారు బుద్ధుని కొండలో బుద్ధుని విగ్రహం తల నరికి చేతిలో పెట్టి విధ్వంసం సృష్టించడానికి ప్రయత్నం చేసిన ఉన్మాదులను పోలీసులు గుర్తించి శిక్షించాలని విజ్ఞప్తి చేసుకున్నారు. ఇప్పటికైనా పోలీస్ డిపార్ట్మెంట్ తక్షణమే స్పందించి అంకిశెట్టిపల్లి మాజీ సర్పంచ్ శరత్ రెడ్డిని, అతని అనుచరులను, అదే గ్రామానికి చెందిన బిజెపి నాయకుడు రాజన్నను, అతనికి సన్నిహితంగా ఉండే ఆర్ఎస్ఎస్ వారిని విచారిస్తే దోషులు బయటపడతారని తెలిపారు. పోలీసులు ఈ విషయం పట్ల నిర్లక్ష్యం వ్యవహరిస్తే ప్రపంచ వ్యాప్తంగా ఉన్న బుద్ధిస్టులకు సమాచారం వెళుతుందని, రాష్ట్రవ్యాప్తంగా బుద్ధిస్ట్ సంఘాలన్నీ కూడా మదనపల్లిలోని బుద్ధుని కొండని సందర్శించే పరిస్థితి ఉందని, ఇది రాష్ట్ర స్థాయి సమస్యగా మారబోతుందని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బాస్ నాయకులు ఆరుమడకల నాగరాజ, గుండ్లూరు రవీంద్ర, పల్లిపోగు హరినాధ, ముల్లంగి గురవయ్య, ఆటో యూనియన్ నాయకులు నంద్యాల రామచంద్ర, హరి ప్రసాద్, షేక్ సలీమ్, చింతపర్తి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## మండలమీట్‌లో ఎంపిటిసి ధ్వజం

గుర్రంకొండ, జులై 4, ప్రభాతవార్త



మండలంలోని ఉద్యానవనశాఖాధికారులు మండలమీట్‌కు రారు మామిడి రైతులకు సబ్సిడీలపై అవగాహన ఇవ్వరని ఎంపిటిసి ఖధీర్ శుక్రవారం జరిగిన మండలమీట్‌లో ధ్వజమెత్తారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్యసమావేవం జరిగింది. ఈ సంధర్భంగా ఎంపిటిసి ఖధీర్ మాట్లాడుతూ మామిడికాయలకు ధరలులేక రైతులు విలవిలలాడుతుంటే హార్టికల్చర్ అధికారులు మాత్రం రైతులకు అవగాహన కల్పించడంలో వెనుకంజ వేస్తున్నారన్నారు. ఏ రోజూ రైతులకు సబ్సిడీలపై రైతులకు పండ్లతోటలపై అవగాహన ఇవ్వలేదని ప్రస్తుతం రాయచోటి పరిసర ప్రాంతాలలో కిలోకి రూ. 4 లు తోతాపురికి సబ్సిడి ఇస్తుంటే గుర్రంకొండ మండలంలో మాత్రం కనీసం సబ్సిడీలకోసం ఎలా దరఖాస్తు చేసుకోవాలి. ఏ మాత్రం సమాచార లేదని కనీసం మండల సర్వసభ్య సమావేశానికి కూడా రాలేదంటే ఎలా విధులు నిర్వహిస్తున్నారో చెప్పాలని ఎంపిడిఒ పరమేశ్వర్‌రెడ్డిని నిలదీశారు. సమావేశంలో టి.రాచపల్లిగ్రామం చింతలవారిపల్లి, మొటుకులలో మంచినీటి సమస్య అధికంగా వుందని ప్రజాప్రతినిధులు లేవనెత్తగా వెంటనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లకు ఎంపిడిఒ ఆదేశించారు. తరిగొండలో మహిళా గ్రూపులకు లోన్లు సక్రమంగా ఇవ్వలేదని సభ్యులు ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సీతమ్మ, సర్పంచ్‌లు లలిత, కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.

## కుటుంబ కలహాలతో ఇద్దరు ఆత్మహత్యాయత్నం

మదనపల్లి క్రైమ్ జూలై 4 ప్రభాతవార్త.
కుటుంబ కలహాలతో ఇద్దరు ఆత్మహత్యాయత్నం పాల్పడిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. బాధితుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కురుపులకోట మండలం సింగన్న గారి పల్లెకు చెందిన సుదర్శన్ (40) వ్యవసాయం చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఇతను కుటుంబ కలహాలతో ఇంట్లోనే పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు అతని జిల్లా ఆసుపత్రికి తరలించి దిగితే చేస్తున్నారు. అలాగే పుంగనూరు మండలం రాంపల్లికి చెందిన వెంకటరమణ భార్య వెంకటమ్మ (48) కుటుంబ సమస్యలతో మనస్థాపం చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం కు పాల్పడింది. ఈమెకు కూడా జిల్లా ఆస్పత్రిలో చికిత్సలు అందిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## విద్యుత్ సమస్యను తీర్చిన మంత్రి

చిన్నమండెం జూలై 04 ప్రభాత వార్త :



చిన్నమండెం మండలం బలిజపల్లె గ్రామస్తులు కొన్ని సంవత్సరాలుగా లో వోల్టేజ్ విద్యుత్ సమస్య తో బాధపడుతున్న విషయం తెలుసుకొని విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి, నూతన 25 కే.వి ట్రాన్స్ఫార్మర్ పెట్టించి సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రాష్ట్ర రవాణా యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రారంభించారు .ఈ కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు కార్యకర్తలు ప్రజలు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయం ఉత్పత్తులతో ఆరోగ్య పరిరక్షణ

చిన్నమండం జూలై 4 ప్రభాతవార్త:
మండలంలోని చాకిబండ యూనిట్ పరిధిలో మల్లూరు గ్రామ సచివాలయం వద్ద ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్‌ను జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వెంకట మోహన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ ఎం టి పద్మావతి, ఎంటి శ్రీనివాసులు, వాల్యూ చైన్ చంద్రశేఖర్ ఆర్ ఇన్‌చార్జ్ తన్మయ్య , చిన్నరెడ్డన్న,పాల్గొన్నారు. రైతులకు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన కూరగాయల వినియోగం వల్ల కలిగే లాభాలను తెలియజేశారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన కూరగాయల ద్వారా తక్కువ ఖర్చుతో మంచి దిగుబడులు వస్తాయని, రైతులకు అధిక లాభాలు లభిస్తాయని తెలిపారు. ప్రతి కుటుంబం ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన ఉత్పత్తులను ప్రాధాన్యంగా వినియోగించుకోవాలి, ఈ కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జ్ అరుణ, కమ్యూనికేషన్ ఇంటెన్ వీణ, లిఖిత,మోడల్ మేకర్ చలపతి నాయుడు, డిజిటల్ మల్లయ్య, ।దిళిశి కిరణ, ,రామాంజు,రఘు, సరళ, వెంకట రామిరెడ్డి,మరియు రైతులు పాల్గొన్నారు.



## విద్యార్థినిలకు బ్రూణ హత్యలపై అవగాహన



తొండూరు జూలై 4 ప్రభాతవార్త:
మండలం లోని డాక్టర్.అంబేద్కర్ గురుకులం విద్యా సంస్థ యందు ప్రిన్సిపల్ ఉషారాణి అద్వర్యంలో నిర్వహించిన లింగ వివక్షత నిర్మూలన అవగాహన కార్యక్రమంనకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖా కార్యాలయం నుండి జిల్లా ఉప మాస్ మీడియా అధికారిని శ్రీమతి దేవిరెడ్డి రమణమ్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 6 సంవత్సరాల వయస్సు కల్గిన పిల్లలలో జిల్లాలో ఆడపిల్లల శాతం తక్కువగా ఉందని ,ఇది సమాజజాడ్యమనీ, సమాజంలో అసమానతలకు కారణబూతమని, అసాంఘిక కార్యక్రమాలకు ప్రేరణ అని తెలిపారు, బ్రూన హత్యలు చట్ట రీత్యా నేరమని ఇటువంటి ఆకృత్యాలకు పాల్పడినవారికి గర్భస్త పూర్వ.గర్భస్త లింగ నిర్ధారణ ప్రక్రియ వ్యతిరేక చట్టం 1994 ప్రకారం శిక్షార్హులు,మొదటిగా బ్రూన హత్యల కు పాల్పడిన సంస్థలు,వైద్యులు,ప్రోత్సహించిన వారికి మొదటిసారి పది వేల రూపాయల జరిమాన 3సంవత్సరాల జైలు శిక్ష,రెండవసారి అదే తప్పు చేసిన వారికి 5సంవత్సరాల జైలు శిక్ష,50వేల రూపాయల జరిమానవిధించబడును,బ్రూన హత్య చేసిన వైద్యుడికి జీవితకాలం వైద్య పట్టా రద్దు చేయ బడునని తెలిపారు. కావున విద్యార్థినులు పై చట్టం గురించి తెలుసుకోవడమే కాకుండా ఇతరులకు తెలియ చెలియ చేయాలని ,ఆడ పిల్లల యొక్క ఆవశ్యకతను గురించి తెలియ చేయాలని కోరారు. ఈ సమావేశం లో డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మల్లయ్య,ఉపాధ్యాయునిలు,ఆరోగ్య కార్యకర్తలు సుజాత,మంజుల ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

## అభివృద్ధికి పాటు పడండి, స్వర్ణాంధ్రను సాధించండి

రైల్వే కోడూరు రూరల్, జూలై 4 ప్రభాతవార్త:
నియోజకవర్గాన్ని అభివృద్ధిలో భాగస్వాములై స్వర్ణాంధ్ర 2047 దిశగా పైనించాలంటూ రైల్వేకోడూరు శాసనసభ్యులు ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్ అన్నారు. శుక్రవారం రైల్వేకోడూరు మండల అభివృద్ధి కార్యాలయంలో అధికారులతో స్వర్ణాంధ్ర 2047 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దాలని అధికారులకు సూచించారు. ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి అభివృద్ధిలో రాష్ట్రాన్ని ముందుంచేందుకు సర్వ ప్రయత్నాలు చేస్తున్నారని అందులో అధికారులు ప్రజలు భాగస్వాములే అభివృద్ధిని ఆకాంక్షించాలని కోరారు. ఇప్పటికే నియోజకవర్గంలో త్రాగునీటి సమస్య మౌలిక వసతులు సిసి రోడ్లు, డ్రైనేజీ తదితర వాటిపై పూర్తిస్థాయిలో ప్రణాళికలు సిద్ధం చేసి ముందస్తుగా అభివృద్ధిని చేస్తున్నామని ఇన్చార్జి ముక్కా రూపానంద రెడ్డి కూటమి నాయకుల సహకారంతో నియోజకవర్గానికి కోట్లాది రూపాయలు నిధులు తెచ్చి అభివృద్ధికి పాటుపడుతున్నామని అందులో అధికారులు ముందస్తుగా పనిచేసి ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రైల్వేకోడూరు ఎంపీడీవో ఎ హెచ్ నాగార్జునా తాసిల్దార్ అమర్నాథ్, ఆర్ ఐ లక్ష్మీదేవి పంచాయితీరాజ్ డిఈ బాల నరసింహులు, ఆర్డబ్ల్యూఎస్ అధికారి రమేష్ వెలుగు ఏసీ మల్లికార్జున రాజు ఏపిఎం వసుంధర ఎంఈఓ 2 సుందర్ బాబు, వైద్యులు బ్రహ్మకుమారి తో పాటు ఓబులవారిపల్లి, చిట్వేలి , పెనగలూరు పుల్లంపేట మండలాల చెందిన మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.





## సుపరిపాలనలో తొలి అడుగు



పెనగలూరు జూలై 4 ప్రభాతవార్త
మండలంలోని పేరం వారి పల్లి తో పాటు అనంపల్లి గోవిందం పల్లి ముద్రపల్లి వెంకట నారాయణ పల్లి గ్రామాలలో శుక్రవారం మండల టిడిపి నాయకుడు దాసరి దామోదర్ నాయుడు అధ్యక్షతన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం జరిగింది బూతు ఇన్చార్జిల సహకారంతో టిడిపి నాయకులు ఇంటింటికి వెళ్లి సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమ కరపత్రాలను ప్రజలకు పంచిపెట్టారు ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జి కొర్రపాటి సుదర్శన్ నాయుడు, బూత్ ఇన్చార్జిలు సురేష్ రెడ్డి,నరసింహ, నాగినేని సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## శభాష్... బాబ్ జాన్. ఎస్సై ప్రశంసల జల్లు

తంబళ్లపల్లె జూలై 4 ప్రభాతవార్త ః



తంబళ్లపల్లె మండల కేంద్రం సిద్ధారెడ్డి గారి పల్లెకు చెందిన కే.బాబ్ జాన్ ఆటో నడుపుకుంటూ జీవనం సాగించే సగటు జీవి. శుక్రవారం తంబళ్లపల్లె నుండి పెద్దమండెం రహదారి వైపు ప్రయాణికులతో ఆటోతో వెళుతుండగా నడిరోడ్డులో రూ 23,300 పడి ఉండగా కనుగొని సరాసరి పోలీస్ స్టేషన్ కు చేరుకుని ఆ డబ్బు సొంతదారునికి అందజేయాలని ఎస్సై ఉమామహేశ్వర్‌రెడ్డికి అందజేశాడు. ఎస్సై ఆటో డ్రైవర్ బాబ్ జాన్ నిజాయితీ ని మెచ్చుకొని ప్రశంసించి ప్రతి ఒక్కరు బాబ్‌జాన్‌ను ఆదర్శంగా తీసుకోవాలని డబ్బు స్వంతదారునికి అందిస్తామని విలేకరులకు తెలిపారు.

## ప్రాణ త్యాగం చేసిన విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు..

కడప కార్పొరేషన్ జూన్ 4 ప్రభాతవార్త:
శుక్రవారం కడప నగరంలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు 128 వ జయంతి సందర్భంగా సీతారామరాజు చిత్రపటానికి పూల మాల తో నివాళి అర్పించారు. ఆఫీస్ సూపరెండెంట్ సురేష్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి అతిధులుగా ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్ రాష్ట్ర కోశాధికారి డాక్టర్. ఐ. శివా నాయక్, జిల్లా అధ్యక్షులు బుక్కే జగన్ రాథోడ్ పాల్గొని మాట్లాడుతూ స్వాతంత్రం రాక మునుపు మన తెలుగు గిరిజనులపైన అక్కడ జీవిస్తున్నవారిపై బ్రిటిష్ వారు హింసాత్మాక చర్యలకు పాల్పడ్డారన్నారు. హింసించారని చెప్పారు. అల్లూరి సీతారామరాజు బ్రిటిష్ లకు ఎదిరించి వారిని అక్కడి నుంచి తరిమివేశారని గుర్తు చేశారు. బ్రిటిష్ వారి నుంచి గిరిజన ప్రజానీకానికి విముక్తి కలిగించారని చెప్పారు. అడివిలో తెచ్చి అమ్ముకొంటున్న వృక్ష సంపదను గిరిజనులే అమ్ముకునేలా చేసి ప్రాణ త్యాగం చేసిన అల్లూరి సీతారామరాజు మహనీయుడని కొనియాడారు. ఈ కార్యక్రమం లో గిరిజన శాఖ సంబందిన ఉద్యోగులు నాగేశ్వర్ రెడ్డి, చిన్నారావు, ఆనంద్ రావు తదితర ఉద్యోగులు పాల్గొన్నారు.



# బాలల హక్కుల పరిరక్షణకు అంకితభావంతో కృషి చేయాలి






**కడప, జులై 04: ప్రభాతవార్త**

బాలల హక్కులను పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరు అంకితభావంతో కృషి చేయాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బి.పద్మావతి సూచించారు. శుక్రవారం కలెక్టరేట్లోని సమావేశ హాల్లో ఏపీ స్టేట్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ సభ్యురాలు బి.పద్మావతి అధ్యక్షతన బాలల హక్కుల పరిరక్షణ, వారి కోసం ఉద్దేశించిన చట్టాల అమలు తీరుపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బి.పద్మావతి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల కమీషన్ విధులను, ఆవశ్యకతను తెలిపారు. బాలల హక్కులపై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలన్నారు. హాస్టల్ వెల్ఫేర్ అధికారులు పిల్లల పట్ల సున్నితత్వంతో మెలిగాలని సూచనలు చేశారు. ప్రధానంగా సంక్షేమ హాస్టల్ లలో మౌలిక వసతులు మెరుగుపర్చాలన్నారు. అలాగే సంక్షేమ హాస్టల్ లలో కంప్లైంట్ బాక్స్ తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. అన్ని కమిటీలకు రిజిస్టర్స్ నిర్వహణ చేపట్టాలన్నారు. ప్రహరీ క్లబ్స్ (డ్రగ్ అబ్యూస్), ప్రొటెక్షన్,ఎడ్యుకేషన్,పేరెంట్స్,హెల్త్ కమిటీలు పాఠశాలలోనే కాకుండా వెల్ఫేర్ హాస్టల్ లలో కూడా ఏర్పాటు చేయాలన్నారు. కమిటీల ఏర్పాటులో నిర్లక్ష్యం వహిస్తే కమిషన్ తరుపున చర్యలు తీసుకుంటామన్నారు. బాలల హక్కులు, చట్టాల అమలు తీరును పర్యవేక్షించేందుకు వీలుగా జాతీయ, రాష్ట్ర స్థాయిలలో కమిషన్ లు పని చేస్తున్నాయని తెలిపారు. క్షేత్ర స్థాయిలో బాల సంరక్షణ, వారి హక్కుల పరిరక్షణ పూర్తి స్థాయిలో జరిగేలా పకడ్బందీగా పర్యవేక్షణ జరపాలని అధికారులకు సూచించారు. అందులోనూ ఏవైనా లోపాలు ఉంటే వాటిని సవరించుకుంటూ ముందుకు సాగాలన్నారు.సంరక్షణ కేంద్రాల్లో, సంక్షేమ హాస్టల్ లలో వున్న బాలలను సొంత బిడ్డల్లాగా వారి బాగోగులు చూడాలన్నారు. వారికి మంచి విద్య అందేలా చూడాలన్నారు. మన కర్తవ్యాన్ని సమర్ధవంతంగా నిర్వర్తించినప్పుడే భావి భారత పౌరులైన బాలల భవితవ్యానికి బంగారు బాటలు వేసినట్లవుతుందన్నారు. పిల్లలు తమకు ఎదురయ్యే ఇబ్బందులు, బాధల గురించి ఎవరికి చెప్పుకోలేని పరిస్థితిలో ఉంటారని అందువల్లే రాజ్యాంగం ద్వారా బాలలకు ప్రత్యేకంగా హక్కులు కల్పించబడ్డాయని తెలిపారు. సమాజ మార్పులకు అనుగుణంగా ప్రభుత్వాలు సైతం ఎప్పటికప్పుడు కొత్తగా బాలల కోసం చట్టాలను రూపొందిస్తూ అమలు చేస్తున్నాయని అన్నారు. పిల్లల సమస్యల కొరకు 1098 టోల్ ఫ్రీ నంబర్ కి ఫోన్ చేసినట్లయితే వాటిని పరిష్కరిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ డిడి సరస్వతి, ఐసిడిఎస్ పిడి శ్రీలక్ష్మి,బీసీ వెల్ఫేర్ డిడి అంజల, మైనారిటీ వెల్ఫేర్ ఆఫీసర్ హిదియతుల్లా, ఉమెన్ పోలీస్ స్టేషన్ డిఎస్పీ బాలస్వామి,జిల్లా బాలల సంరక్షణ అధికారి సుభాష్ హాస్టల్ వెల్ఫేర్ అధికారులు, సహాయ సాంఘిక వెల్ఫేర్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు... అన్నమాచార్య యూనివర్సిటీ లక్ష్యం

- విదేశీ యూనివర్సిటీలతో ఒప్పందం
- ఉద్యోగ అవకాశాలకు ప్రాధాన్యం
- సినిమా రంగానికి అవసరమైన కోర్సులు
- ఫోరెన్సిక్ రంగంలో కొత్త కోర్సులు
- త్వరలో ఇంటర్ విద్యార్థులకు యూనివర్సిటీ ఓపెన్ డే
- ఛాన్సలర్ డాక్టర్ సి. గంగిరెడ్డి
- ఉపకులపతి డాక్టర్ ఈ. సాయిబాబరెడ్డి



**రాజంపేట, జూలై4 ప్రభాతవార్త**

కలలు కనాలి సాకారం చేసుకోవాలి. ఇది క్షిపణి పితామహుడు అబ్దుల్ కలాం మాట. అయితే పుట్టిన ఊరిలోనే ఇంజనీరిం గ్ కాలేజ్. అందులోనూ గ్రామీణ నేపథ్యంలో ఏర్పాటు. సక్సెస్ కావడం ఆషామాషీ కాదు. ఇది ఒక చాలెంజ్. అది సాధించాడు. ఇక చాలులే అనుకోలేదు. యూనివర్సిటీ స్థాపించాడు.అదే అన్నమాచార్య విశ్వవిద్యాలయం. విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు అందించడమే లక్ష్యం. ప్రధానంగా ఉద్యోగ అవకాశాలు కల్పించడం. విదేశీ యూనివర్సిటీలతో భాగస్వామ్యం. నాణ్యతతో కూడిన విద్యను అందించడం ద్వారా కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాల విద్యా వికాస నిర్ణయాలను అమలు చేయడం లక్ష్యంగా తమ యూనివర్సిటీ ముందుకు వెళుతుందని అన్నమాచార్య విశ్వవిద్యాలయం వ్యవస్థాపకుడు, యూనివర్సిటీ ఛాన్స్ లర్ డాక్టర్ చొప్పా గంగిరెడ్డి తెలిపారు. యూనివర్సిటీ ఏర్పాటు తర్వాత ఉపకులపతిగా బాధ్యత స్వీకరించిన డాక్టర్ ఈ.సాయిబాబు రెడ్డితో కలిసి వార్త తో ప్రత్యేకంగా మాట్లాడారు. యూనివర్సిటీ భవిష్యత్ కా ర్యాచరణ వెల్లడించారు. అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల 1998లో ప్రారంభించాం. 2024 25 విద్యా సంవత్సరంలో అనుమాచార్య యూనివర్సిటీ అనుమతి లభించింది. అన్నమాచార్య ఎడ్యుకేషన్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ ద్వారా ఇప్పటికి 25 వేల మంది విద్యార్థులకు ఉన్నత విద్య అందించాం. యూనివర్సిటీగా అనుమతి లభించిన సంవత్సరం లోపే ఈ ప్రాంత విద్యార్థులకు ఎంతో అవసరమైన అగ్రికల్చర్ కళాశాల ఏర్పాటు చేశాం. వెంటనే పారామెడికల్ కోర్సులు అందుబాటుకు తీసుకొచ్చాం. పది రోజుల క్రితంఖి లా ఖికళాశాల ఏర్పాటు చేశాం. నేటి యువత సినిమా రంగం పై ఎక్కువ మక్కువ చూపుతోంది. అందుకు సంబంధించి సినిమా రంగంలో స్థిరపడేలా యువత కోసం ఫిల్మ్ మేకింగ్ కోర్సులు ఏర్పాటు చేసేందుకు నిర్ణయించాం. ఒకప్పుడు భారతదేశంలో ఫోరెన్సిక్ లేబరేటరీలో హైదరాబాద్కు ప్రత్యేక స్థానం ఉండేది. నేడు మారుతున్న సాంకేతిక రంగంలో ఫోరెన్సిక్ కు ఎక్కువ డిమాండ్ ఉంది. అందుకే విద్యార్థులకు ఫోరెన్సిక్ కోర్సులను అందుబాటులోకి తీసుకొచ్చే ప్రయత్నంలో ఉన్నాం. యూనివర్సిటీ ఏర్పాటు తర్వాత కొత్త కోర్సులు తీసుకొచ్చే విషయంలో ఏమాత్రం వ్యాపార దృష్టితో ఆలోచించడం లేదు. యువతకు అవసరమైన అన్ని కోర్సులను ఏర్పాటు చేయాలనేది తమ ప్రధాన లక్ష్యం. అర్బన్ ప్రాంతంలో పోల్చితే గ్రామీణ నేపథ్యమున్న విద్యార్థుల్లోనే ఎక్కువ నైపుణ్యం ఉందని పలు అధ్యయనాలలో తేలింది. అందుకే గ్రామీణ ప్రాంత విద్యార్థుల కోసమే ఇక్కడ మొదటి ఇంజనీరింగ్ కళాశాల ప్రారంభించాం. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడం ద్వారా విద్యార్థుల తల్లిదండ్రుల ఆకాంక్షలను ప్రతిబింబించేలా విశ్వవిద్యాలయం స్థాయికి అభివృద్ధి చేయగలిగాం. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తే ఎక్కడైనా ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. అందుకు అనుగుణంగా ఫ్యాకల్టీని కూడా పూర్తిస్థాయిలో సన్నద్ధం చేస్తున్నాం. అన్నమాచార్య యూనివర్సిటీలో ఇంజనీరింగ్ ఇతర గ్రాడ్యుయేషన్ కోర్సులు అభ్యసించే విద్యార్థులకు విదేశీ యూనివర్సిటీలో చదివే ఏర్పాటు చేస్తున్నాం. రెండేళ్లు ఇక్కడ మరో రెండేళ్లు అమెరికా, ఇంగ్లాండ్ దేశాల్లోని యూనివర్సిటీలో చదివే అవకాశాలు కల్పిస్తున్నాం. ఇప్పటికే ఆచన్, విన్ కాన్సిన్, పెన్సిల్వేనియా యూనివర్సిటీలతో ఎంఓయు కుర్చుకున్నాం. మరిన్ని యూనివర్సిటీలతో కూడా ఇంకా సంప్రదింపులు జరుపుతున్నాం. ఎంఎస్ హానర్స్ కూడా విదేశీ యూనివర్సిటీలలో తక్కువ ఫీజుతో చదివేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. ఎడ్యుకేషన్ ద్వారా సమాజానికి సేవ చేసేలా విద్యార్థులను ప్రోత్సహిస్తాం. ఇందుకు ఇన్నోవేటివ్ ఆలోచనలతో ముందుకు వెళతాం. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు అత్యున్నత ప్రమాణాలను పాటిస్తాం. విద్యార్థులు విద్యాపరంగానే కాకుండా వ్యక్తిగతంగా రాణించడానికి ప్రేరణ పొందే వాతావరణ సృష్టించే ప్రయత్నాలు చేస్తున్నాం. నైపుణ్య అభివృద్ధి సాధించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. అగ్రికల్చర్ విద్యార్థులకు ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన హైదరాబాద్ ఇక్రిసాట్ తీసుకువెళ్లి అక్కడ పరిస్థితులు ఆకలింపు చేసుకొనేలా చేస్తాం. ఇంటర్ విద్యార్థులు ఎప్పుడైనా యూనివర్సిటీకి వచ్చి చూసేలా ఖియూనివర్సిటీ ఓపెన్ డే ఖివిధానాన్ని త్వరలో అమలు చేస్తాం. అన్నమాచార్య యూనివర్సిటీని రాష్ట్రంలోనే ఒక మోడల్ యూనివర్సిటీగా అభివృద్ధి చేసి విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు అందించేందుకు అంకిత భావంతో కృషి చేస్తున్నామన్నారు. దేశ విదేశాల్లోని కార్పొరేట్ సంస్థలు కూడా అన్నమాచార్య యూనివర్సిటీ కి స్వయంగా వచ్చి క్యాంపస్ రిక్రూట్మెంట్ ద్వారా విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు ఇచ్చేలా చేసి బంగారు భవిష్యత్తు ఇవ్వడమే తమ ముందు ఉన్న ప్రధాన కర్తవ్యం అన్నారు.



చొప్పా గంగిరెడ్డి



సాయి బాబారెడ్డి,

# దోమల నివారణతోనే ప్రజారోగ్యం సాధ్యం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా మలేరియా నియంత్రణ అధికారి




నీటి నిల్వలను పరిశీలిస్తున్న మలేరియా నియంత్రణ అధికారి

**పీలేరు, జూలై 4 ప్రభాతవార్త:**

దోమల నివారణతోనే ప్రజారోగ్యం ఇది చక్కటి మార్గమని జిల్లా మలేరియా నియంత్రణాధికారి ఆర్. రామచంద్రా రెడ్డి తెలిపారు. జాతీయ డెంగ్యూ మసోత్సవాల సందర్భంగా శుక్రవారం పీలేరు పట్టణములోని కోటపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అవగాహన, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రామచంద్రా రెడ్డి మాట్లాడుతూ మన నివాస ప్రాంతాలు, పరిసరాల్లో డెంగ్యూ వ్యాధులకు కారణమయ్యే టైగర్ దోమ తన సంతతిని ఉత్పత్తి చేసుకునేందుకు వినియోగించే నీటి నిల్వలను శుభ్రం చేయడంతో పాటు తాజా నీటి నిల్వలపై మూతలు పెట్టాలని, దోమల వల్ల వచ్చే వ్యాధుల నియంత్రణకు ఇదో ఉత్తమ పద్ధతని, ఇంటింటా నిర్వహించే ఫ్రైడే డ్రై డే కార్యక్రమం పట్ల ప్రజల్లో అవగా పెంచాలని, దోమల నియంత్రణలో విద్యార్థులను కూడా భాగస్వాములను చేసి, వ్యాధుల రహిత పీలేరును నిర్మిద్దామని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం "దోమల అంతం మనందరి పంతం" అంటూ విద్యార్థులు నినాదాలు చేస్తూ ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి విద్యాసాగర్, హెడ్మాస్టర్ శివశంకర్, డిప్యూటి హెచ్ఇఓ.కొండయ్య, యంపిహెచ్ఇఓ శ్రీనివాసులు, పర్యవేక్షకులు కుసుమ, రెడ్డెప్ప, ఏఎన్ఎంలు భార్గవి, లక్ష్మీ, చంద్రకళ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

# శ్రీ సౌమ్యనాథ స్వామివారి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ





**రాజంపేట, జూలై4 ప్రభాతవార్త**

నందలూరు శ్రీసౌమ్యనాథ స్వామి వారి ఆలయంలో జూలై 05 నుండి 13వ తేదీ వరకు నిర్వహించనున్న వార్షిక బ్రహ్మోత్సవాలకు శుక్రవారం సాయంత్రం అంకురార్పణ చేపట్టారు. ముందుగా సాయంత్రం 6 గంటల నుండి పుణ్యాహవచనం, మృత్సంగ్రహణం, సేనాధిపతి ఉత్సవం అనంతరం శాస్త్రోక్తంగా బ్రహ్మోత్సవాలకు అంకురార్పణం నిర్వహించారు. టిటిడి వేద పండితులు, ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నేడు ధ్వజరోహణం వైభవంగా నిర్వహించనున్నారు. ధ్వజారోహణంతో శ్రీ సౌమ్యనాథస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఇందులో భాగంగా ఉదయం ఆలయంలో పలు కైంకర్యాలు నిర్వహించనున్నారు. ఉదయం 10.30 11.00 గం.ల వరకు సింహలగ్నంలో ధ్వజారోహణ ఘట్టాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించనున్నారు. అదేరోజు సాయంత్రం 05 గం.లకు ఊంజల్ సేవ, రాత్రి 07.00 గం.లకు యాళివాహనం, చతుస్థానార్చనము జరుగనున్నాయి. బ్రహ్మోత్సవాల్లో ప్రతిరోజు ఉదయం 8 గంటలకు, రాత్రి 7 గంటలకు వాహనసేవలలో స్వామివారు విహరిస్తారు. సౌమ్యనాథ స్వామి ఆలయ చరిత్ర శ్రీ సౌమ్యనాథ స్వామివారి ఆలయ నిర్మాణానికి 11వ శతాబ్ధంలో చోళవంశరాజు కుళోత్తుంగ చోళుడు శ్రీకారం చుట్టినట్లు చరిత్ర చెబుతోంది. చోళ, పాండ్య, కాకతీయ, విజయనగర రాజులచే 17వ శతాబ్దం వరకు ఆలయం నిర్మాణం కొనసాగింది.మట్టిరాజుల కాలంలో ఆలయం ప్రసిద్ధి చెందింది. 12వ శతాబ్దంలో కాకతీయ ప్రతాపరుద్రుడు రాజగోపురం కట్టించినట్లు శాసనాల ద్వారా తెలుస్తోంది. ప్రసిద్ధ వాగ్గేయకారుడు తాళ్ళపాక అన్నమాచార్యుల జన్మస్థలమైన తాళ్ళపాక గ్రామం నందలూరుకు దగ్గరలో ఉన్నందున అన్నమాచార్యుల వారు శ్రీవారిని దర్శించి స్వామివారిపై కీర్తనలు రచించినట్లు ప్రతీతి. ఈ ఆలయంలో ఎటువంటి దీపం లేకున్నా స్వామివారు ఉదయం నుండి సాయంకాలం వరకు దేదీప్యమానముగా వెలుగొందే విధముగా ఆలయమును నిర్మించడం ఒక అద్భుతం. సంవత్సరంలో ఏదో ఒకరోజు సూర్యకిరణాలు స్వామి వారి పాదాలపై ప్రసరించే విధముగా శిల్పులు నిర్మించారు.

# టీబీ వ్యాధిని నివారించవచ్చు



**బద్వేలు, జూలై 4, ప్రభాతవార్త**

ప్రాథమిక స్థాయిలో టీబీ వ్యాధిని గుర్తిస్తే చికిత్స ద్వారా చికిత్స ద్వారా నయం చేయవచ్చు భయపడవలసిన అవసరం లేదని తొట్టిగారిపల్లి వైద్యాధికారి జయ వినయ్ కుమార్ అన్నారు. మండలంలోని తిరువంగలాపురం గ్రామంలో 104 కార్యక్రమంలో భాగంగా టీబి ముక్త్ భారత్ అభియాన్, జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం గలలో, గళ్ళలో రక్తం పడటం, చాతిలో నొప్పి ఆయాసం, ఆకలి మందగించడం బరువు తగ్గటం తదితర లక్షణాలు ఉంటాయన్నారు. బీడీ సిగరెట్ పాన్ మసాలా, మద్యానికి దూరంగా ఉండాలన్నారు. క్షయ వ్యాధి సోకితే ఆరు నెలలపాటు ప్రభుత్వ ఆసుపత్రులలో ఉచితంగా మందులు ఇవ్వడం జరుగుతుందన్నారు. అటువంటి వారికి కేంద్ర ప్రభుత్వం ప్రతినెల నిక్షయ పోషణ యువజన ద్వారా 1000 రూపాయలు వారి బ్యాంక్ అకౌంట్కు జమ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టిబి సూపర్వైజర్ నరసింహ ప్రసాద్ ల్యాబ్ సూపర్వైజర్ బ్రహ్మారెడ్డి సూపర్వైజర్ వెంకటమ్మ, హెల్త్ అసిస్టెంట్ జనార్దన్ రావు సిహెచ్ఓ హర్షిత ఏఎన్ఎంలు వాణిశ్రీ, మహాలక్ష్మి ఆశాలు పాల్గొన్నారు.

# ప్రహరీ గోడను ప్రారంభించిన మంత్రి



**చిన్నమండెం జూలై 04 ప్రభాతవార్త :**

చిన్నమండెం కస్బా నందు గల జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల నందు నూతనంగా 43.00 లక్షల రూపాయలతో నిర్మించిన ప్రహరీ గోడ, ఆర్ ఓ ప్లాంట్ ను శుక్రవారం రాష్ట్ర రవాణా యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రారంభించారు .ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ హై స్కూల్ నందు ఉన్న సమస్యలను త్వరలోనే పరిష్కరించి, పిల్లలకు కావలసిన పరికరాలు తన సొంత నిధులతో తెప్పిస్తానని ఉపాధ్యాయులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రి సతీమణి మండిపల్లి హరితమ్మ మంత్రి తమ్ముడు లక్ష్మీ ప్రసాద్ రెడ్డి మరియు మండల అధికారులు, టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# స్వగ్రామంలో ప్రజాదర్బార్



**చిన్నమండెం, జూలై 04 ప్రభాతవార్త**

మండలంలోని బోరెడ్డిగారిపల్లెలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రజా దర్బార్ నిర్వహించారు. ప్రజల నుండి వినతిపత్రాలు స్వీకరించి, సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు. ప్రజలిచ్చే రెవెన్యూ సమస్యలకు తొందరగా పరిష్కారం చూపాలని అధికారులు ఆదేశించారు. పలు అభివృద్ధి పనులపై అధికారులకు తగిన సూచనలు ఇచ్చారు. ప్రజలతో ప్రత్యక్షంగా మమేకమవుతూ వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్థాయి నాయకులు పాల్గొన్నారు.

# నిరుపేదల కోసమే సూపర్‌సిక్స్ పథకాలు



ఇంటింటా కార్యక్రమంలో ఎమ్మెల్యే

**మదనపల్లె, జులై 4 ప్రభాతవార్త :**

నిరుపేదల సంక్షేమం కోసమే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సూపర్‌సిక్స్ పథకాలు ప్రవేశపెట్టారని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. శుక్రవారం రూరల్ మండలంలోని కోళ్ళబైలు పంచాయితీ నందు సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటా తెలుగుదేశం చేపట్టిన సంక్షేమ పథకాలను కరపత్రాల ద్వారా ఎమ్మెల్యే ఇంటింటి వెళ్ళి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం ఇవ్వని విధంగా వృద్ధులు, దివ్యాంగుల కోసం అత్యధికంగా పెన్షన్‌లు ఇస్తున్నది ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. ఏడాదిలో ఉచితంగా మూడు దీపం కనెక్షన్స్, అర్హులైన ప్రతి కుటుంబానికి తల్లికి వందనం పేరుతో రూ.15వేలు జమ చేయడం జరిగిందన్నారు. వచ్చే నెల నుంచి మహిళలకు ఆర్టీసి బస్సుల్లో ఉచిత బస్సు సౌకర్యం కల్పించడం జరుగుతుందన్నారు. కోళ్ళబైలు గ్రామంలో సమస్యలపై ప్రజలు ఇచ్చిన అర్జీలను పరిశీలించి త్వరగా పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర పరిశీలకులు గురుమూర్తిగౌడ్, సురేష్, అజ్వర్వర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అనంతరం ఎన్‌వీఆర్ కళ్యాణ మండపంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ విజయానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి పార్టీ పదవులు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సదుం మార్కెట్‌యార్డు ఛైర్మెన్ శ్రీనివాస్, ఎర్రబల్లి వెంకటరమణారెడ్డి, డ్యాన్స్ రెడ్డప్ప, మల్లికార్జున నాయుడు, కోనభాస్కర్, షంషీర్, బెల్లె రెడ్డిప్రసాద్, రఘుపతినాయుడు, కప్పల శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

# హామీల అమలుతో సంతృప్తి

**ప్రొద్దుటూరు, జులై 4, ప్రభాతవార్త**

గత ఎన్నికలలో ప్రజలకు ఇచ్చిన సంక్షేమ పథకాల హామీలన్నీ కూటమి ప్రభుత్వం అమలు చేయడంతో ప్రజలు సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారని మాజీ ఎంపీపీ టిడిపి నాయకులు నంద్యాల రాఘవరెడ్డి తెలిపారు. శుక్రవారం ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని గోపవరం గ్రామ పంచాయతీ పరిధిలోని ఆచార్య కాలనీ నందు "సుపరిపాలన తొలి అడుగు" ఇంటింటి ప్రచార కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ ఎంపిపి రాఘవరెడ్డి మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య యువ నాయకులు బచ్చల ప్రతాప్ తో కలిసి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సంవత్సరం కాలంలో తీసుకొచ్చిన మార్పులను, ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం చేపట్టిన ప్రతి పని, భవిష్యత్తులో చేయబోయే కార్యక్రమాలను ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరించారు. ఈనపద్యంలో సంక్షేమ పథకాల వల్ల లబ్ది చేకూరిన ప్రజలు ఎంతో సంతృప్తిని సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, నంద్యాల ఆనంద్ భార్గవ్ రెడ్డి, జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు కొత్తపల్లె సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రా రెడ్డి, బచ్చల ప్రతాప్, పొట్టు లక్ష్మిరెడ్డి, ఆవుల రాజేశ్వర్ రెడ్డి, మల్లెల భాస్కర్ రెడ్డి, పట్నం లక్ష్మణ్, పల్లె గురివిరెడ్డి, చంద్రమోహన్ రెడ్డి, దేవిరెడ్డి జయరాం రెడ్డి, రాష్ట్ర వక్ఫ్ బోర్డు డైరెక్టర్ బేపారి జాకీర్, నాగరాజు, మాజీ జడ్పీటీసీ సభ్యులు తోట మహేశ్వర రెడ్డి, చౌటపల్లె లక్ష్మిరెడ్డి, జిల్లా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు బద్వేలు శ్రీనివాసుల రెడ్డి, టౌన్ బ్యాంక్ చైర్మన్ బొగ్గుల సుబ్బారెడ్డి, బిసి నాయకులు చల్లా రాజగోపాల్ యాదవ్, వద్ది బాలుడు, మున్సిపల్ కౌన్సిలర్లు మురళీధర్ రెడ్డి, గౌస్, మహమ్మద్ గౌస్, జిలాన్, మునీర్, కమాల్ బాషా, రామాంజనేయులు రెడ్డి, వివేకానంద కాలనీ శివ కూటమి నాయకులు, కార్యకర్తలు, నందమూరి అభిమానులు పాల్గొన్నారు.



# నిరుద్యోగులకు ఉచిత ఉపాధి శిక్షణ ...

**ముద్దనూరు, జూలై 04, ప్రభాతవార్త:**

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో గ్రామీణ నిరుద్యోగులకు ఉచిత శిక్షణ తో కూడిన ఉపాధి అవకాశాలు లను సిడాఫ్ సౌజన్యంతో నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ కడప సంస్థ ఆధ్వర్యంలో బ్యూటీ తెరపి, కంప్యూటర్ స్కిల్స్, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్, వెబ్ డెవలపర్, స్పోకెన్ ఇంగ్లీష్, కమ్యూనికేషన్, స్కిల్స్ వంటి తదితర అంశాలపై ఉచితంగా శిక్షణ అందిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి నరసింహులు ప్రకటనలో తెలిపారు. గ్రామీణ ప్రాంత నిరుద్యోగులు సద్వినియోగ పరుచు కోవాలనీ కోరారు.

# ప్రత్యేక పూజలు

**రామసముద్రం జులై 4 ప్రభాతవార్త**

రామసముద్రం మండలకేంద్రంలో ని బిసి కాలనీ వద్ద వెలిసిన దుర్గలమ్మ ఆలయం, తిరుమలరెడ్డి పల్లె మారేమ్మ, ఆషాడ శుక్రవారం పర్వదినం రోజున ఘనంగా పూజలు నిర్వహించారు.ఆలయ ముఖ ద్వారం దగ్గర మామిడి, వేపాకుతో తోరణాలు కట్టి ఆలయ శుద్ధి చేసి దుర్గల మ్మ కు పలురకాల పుష్పాలు, వేపాకుతో అలంకరణ చేసి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు అర్చనలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు . అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారికి భక్తి శ్రద్ధలతో పూజలు చేసి అమ్మ వారికి పొంగల్ నైవేద్యం పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు.ఆలయ పూజారి భక్తులకు అమ్మ వారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు.అలాగే మండలంలోని తిరుమల రెడ్డిపల్లె గ్రామంలో వెలిసిన మారెమ్మ ఆలయంలో పూజారి శీనప్ప అమ్మ వారికి అభిషేకాలు అర్చనలు నిర్వహించారు. భక్తులకు ఆలయ పూజారి అమ్మ వారి దర్శనం కల్పించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.రాత్రి అమ్మ వారి ఆలయంలో గ్రామస్తులచే భజన కార్యక్రమం నిర్వహించారు.

